thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 182 | జగిత్యాల శనివారం 10 అక్టోబర్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

## మ్యాచ్ వేళ.. స్టేడియానికి బాంబు బెదిరింపు!



11

## ఉపఎన్నికల్లో ఎన్డీఏ అఖండ విజయం



- సుపరిపాలన ఎజెండాకు ప్రజల పట్టాభిషేకం అని మోదీ హర్షం!
- ప్రజల విశ్వాసానికి కృతజ్ఞతలు తెలిపిన ప్రధాని
- సుపరిపాలనకు లభించిన మద్దతుగా అభివర్ణన

4

## భారత సంతతి నవనీతమ్ నవీ పిళ్లైకి నోబెల్ శాంతి బహుమతి

అంతర్జాతీయ చట్టాల పరిరక్షణ, మానవ హక్కుల పరివర్తన, ప్రపంచ శాంతి స్థాపనకు దశాబ్దాలుగా అంకితభావంతో సేవలందిస్తున్న దక్షిణాఫ్రికాకు చెందిన భారతీయ తమిళ సంతతి ప్రముఖ న్యాయకోవిదురాలు నవనీతమ్ "నవీ" పిళ్లైకి ప్రతిష్ఠాత్మక 'నోబెల్ శాంతి బహుమతి-2026' లభించింది.



4

## ఈగను చంపడానికి సుత్తిని వాడలేరు

'కాక్రోచ్ జనతా పార్టీ' శనివారం (అక్టోబర్ 10) చేపట్టిన ధర్నాను అడ్డుకునేందుకు కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ పోలీసులు విధించిన కఠిన ఆంక్షలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. నిరసనలను నియంత్రించే నెపంతో సామాన్య పౌరుల రాకపోకలపై పూర్తి నిషేధం విధించడం, రవాణా వ్యవస్థను స్తంభింపజేయడం రాజ్యాంగబద్ధం కాదని స్పష్టం చేసింది.



4

# ఢిల్లీలో నిరసనల సెగ




## అర్ధరాత్రి నుంచి ఇంటర్నెట్ బంద్?

### జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా డిమాండ్‌తో నేడు ధర్నాకు పిలుపు

- అనుమతి నిరాకరించినా ఆందోళనకు సిద్ధమంటున్న సీజేపీ
- 57 మెట్రో స్టేషన్ల మూసివేత.. భారీ బందోబస్తు అంటూ ప్రచారం
- కేంద్ర ఢిల్లీలో నిషేధాజ్ఞలు.. పోలీసుల అప్రమత్తత
- నిరసనలపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన పార్టీ

ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియలో పారదర్శకత లోపించిందని, 13 కోట్లకు పైగా ఓట్ల తొలగింపునకు బాధ్యత వహిస్తూ కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ 'కాక్రోచ్ జనతా పార్టీ' శనివారం (అక్టోబర్ 10) చేపట్టిన ధర్నాను అడ్డుకునేందుకు కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ పోలీసులు విధించిన కఠిన ఆంక్షలపై భారత అత్యున్నత న్యాయస్థానం (సుప్రీంకోర్టు) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. నిరసనలను నియంత్రించే నెపంతో సామాన్య పౌరుల రాకపోకలపై పూర్తి నిషేధం విధించడం, రవాణా వ్యవస్థను స్తంభింపజేయడం రాజ్యాంగబద్ధం కాదని స్పష్టం చేసింది. "ఈగను చంపడానికి సుత్తిని ఉపయోగించలేరు" అంటూ ప్రభుత్వం అనుసరించిన అతి కఠిన విధానాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఘాటుగా తప్పుపట్టింది.

**న్యూఢిల్లీ, అక్టోబర్ 9 (చురకలు):** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చే యాలంటూ కాక్రోచ్ జనతా పార్టీ శనివారం చేప ట్టనున్న భారీ నిరసన నేపథ్యంలో దేశ రాజధాని ఢిల్లీ అట్టుడుకుతోంది. జంతర్‌మంతర్ వద్ద ఆందో ళనకు పోలీసులు అనుమతి నిరాకరించినప్పటికీ నిరసన నిర్వహించి తీరుతామని నిర్వాహకులు ప్రక టించడంతో కేంద్ర ఢిల్లీని భద్రతా బలగాలు తమ ఆధీనంలోకి తీసుకుంటున్నాయి. వేలాది మంది పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలను మోహరిం చడంతోపాటు ప్రధాన రహదారుల్లో బారికేడ్లు ఏర్పా టు చేశారు. శుక్రవారం రాత్రి

మిగతా 4 లో





# హైదరాబాద్ ట్రాఫిక్‌కు ఇక చెక్!

## కొత్త రవాణా వ్యవస్థకు శ్రీకారం!

- నగర రవాణా వ్యవస్థలో భారీ మార్పులకు సర్కారు కసరత్తు
- రద్దీ ప్రాంతాల్లో సరికొత్త వ్యక్తిగత వేగవంత రవాణా వ్యవస్థ
- కేబీఆర్ పార్కు చుట్టూ వన్‌వే.. ఫ్లైఓవర్లకు వేగం
- ఏడాదిలోగా రహదారి పనులు పూర్తి చేయాలని సీఎం ఆదేశం

హైదరాబాద్‌లో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ఏం చేయబోతోంది? నిత్యం రద్దీతో సతమతమవుతున్న నగరవాసులకు కొత్త ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి రానుందా? మెట్రో, ఎంఎంటీఎస్, బస్సులతోపాటు మరో అత్యాధునిక రవాణా వ్యవస్థ నగర రోడ్లపైకి రాబోతోందా..? ఈ ప్రశ్నలకు సమాధానంగా ప్రభుత్వం సరికొత్త ప్రణాళికలపై కసరత్తు ప్రారంభించింది. మహానగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు వ్యక్తిగత వేగవంత రవాణా వ్యవస్థను ప్రవేశపెట్టే అవకాశాలను పరిశీలిస్తోంది. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా క్యూర్ పరిధిలో ప్రజా రవాణా సదుపాయాలను మెరుగుపరచాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

2



# పూల పండుగకు వేళాయె

## తెలంగాణలో బతుకమ్మ సందడాయె!

- నేటి నుంచి తొమ్మిది రోజులపాటు బతుకమ్మ సంబరాలు
- తంగేడు, గునుగు పూలతో ముస్తాబవుతున్న పల్లెలు, పట్టణాలు

2

# ఎన్నికల్లో అక్రమాలు జరిగాయి

## రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు 'ఇండియా' కూటమి ఫిర్యాదు!

.4లో



# కల నెరవేరి పదేళ్లు పూర్తి

- నాటి గోడ మీద రాతలే నేడు నిజయమ్యాయి
- జిల్లా కోసం ఎన్టీఆర్ కు వినతిపత్రం ఇచ్చిన కేసీఆర్
- అదే కేసీఆర్ సీఎంగా సిద్దిపేట జిల్లా ఏర్పాటు
- రైలు, గోదావరి జలాలు సిద్దిపేటకు వచ్చాయి
- సిద్దిపేట దశాబ్ది ఉత్సవాల్లో హరీశ్ రావు

3






## అర్ధరాత్రి బర్త్‌డే వేడుకలా..

# ప్రాణాలతో చెలగాటమే!

- ఇళ్లలోనే సురక్షితంగా వేడుకలు చేసుకోవాలన్న సీపీ సజ్జనార్
- ట్యాంక్‌బండ్‌పై చిన్నారి, బంధువు మృతి నేపథ్యంలో పోలీసుల హెచ్చరిక

2

# జీఓ 59 దరఖాస్తులకు నెల రోజుల్లో మోక్షం

## 500 గజాల లోపు ప్లాట్ల దరఖాస్తులపై సర్కారు కీలక నిర్ణయం

- పెండింగ్ దరఖాస్తుల పరిశీలనకు మెమో జారీ
- 22ఏ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు
- నిబంధనల ప్రకారమే నిర్ణయాలు.. అక్రమాలకు తావులేదన్న మంత్రి
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడి

2



3



## ప్రజాస్వామ్యానికి గుండె చప్పుడు

# సమాచార హక్కు!

- పారదర్శక పాలనకు, జవాబుదారీతనానికి బలమైన పునాది
- ప్రతి దరఖాస్తు వెనుక ఓ సమస్య.. న్యాయం కోసం ప్రయత్నం
- ప్రజలు అడగకముందే సమాచారం అందుబాటులో ఉంచాలి
- 'సమాచార దర్పణం' ఆవిష్కరించిన గవర్నర్ శివప్రతాప్ శుక్లా



# ఉపఎన్నికల్లో ఎన్‌డీఏ అఖండ విజయం

**సుపరిపాలన ఎజెండాకు ప్రజల పట్టాభిషేకం అని మోదీ హర్షం!**

**ప్రజల విశ్వాసానికి కృతజ్ఞతలు తెలిపిన ప్రధాని**

**సుపరిపాలనకు లభించిన మద్దతుగా అభివర్ణన**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 9 (చురకలు):** దేశవ్యాప్తంగా ఇటీవల నిర్వహించిన లోక్‌సభ మరియు వివిధ రాష్ట్రాల శాసనసభ ఉపఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నాయకత్వంలోని ఎన్‌డీఏ కూటమి అఖండ విజయాన్ని సాధించింది. ఈ ప్రజా తీర్పుపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేస్తూ.. ప్రధాని మోదీ నాయకత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలన ఎజెండాతో దేశ ప్రజలకు ఉన్న అచంచలమైన అనుబంధానికి మరియు నమ్మకానికి ఈ విజయం స్పష్టమైన నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం మరియు దేశ సమగ్ర వికాస ఆకాంక్షలను నెరవేర్చేందుకు ఈ ప్రజా తీర్పు తమకు మరింత బాధ్యతను, శక్తిని ప్రసాదించిందని తెలిపారు. అస్సాంలోని నగావ్ లోక్‌సభ స్థానంతో పాటు పశ్చిమ బెంగాల్‌లోని నందిగ్రామ్, రెజీనగర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీ అభ్యర్థులు నమోదు చేసిన ఘనవిజయాలపై ప్రధాని మోదీ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ప్రత్యేకంగా స్పందించారు. "మాపై నిరంతరం తమ ఆశీస్సు వర్షం కురిపిస్తున్న ప్రజానీకానికి నా హృదయపూర్వక ధన్యవాదాలు. విజయం సాధించిన అభ్యర్థులకు అభినందనలు తెలియజేస్తూనే, ఈ చారిత్రాత్మక విజయం కోసం రాత్రింబవళ్లు శ్రమించిన పార్టీ శ్రేణులు, కార్యకర్తల కృషిని మనస్ఫూర్తిగా ప్రశంసిస్తున్నాను" అని వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్‌లోని రెజినగర్ స్థానంలో బీజేపీ అభ్యర్థి శంఖారవ్ సర్కార్ 75,000కు పైగా భారీ మెజార్టీతో గెలవగా, కీలకమైన నందిగ్రామ్‌లో హసిరానీ రత్ 1.22 లక్షలకు పైగా ఓట్ల ఆధిక్యంతో ప్రత్యర్థులపై విరుచుకుపడ్డారు. అలాగే పుదుచ్చేరిలోని తట్టంచావడి స్థానంలో గెలుపొందిన మైత్రి పక్షం 'ఆల్ ఇండియా ఎన్‌ఆర్ కాంగ్రెస్' అభ్యర్థి అశోక్ ఆనంద్‌కు, అస్సాం నగావ్ పార్లమెంట్ స్థానంలో విజయం సాధించిన దేవాశిష్ శర్మకు ప్రధాని ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. తమ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి, సమగ్ర వికాసానికి మరింత అంకితభావంతో పునరంకితం అవుతుందని స్పష్టం చేశారు.

# అర్ధరాత్రి బర్త్‌డే వేడుకలా.. ప్రాణాలతో చెలగాటమే!

**క్షణకాలపు ఆనందం కోసం ప్రాణాలు పోగొట్టుకోవద్దు**

**ఇళ్లలోనే సురక్షితంగా వేడుకలు చేసుకోవాలన్న సీపీ సజ్జనార్**

**రోడ్లు, చెరువులు, పార్కుల వద్ద కేక్ కటింగ్‌లు వద్దు**

**ట్యాంక్‌బండ్‌పై వేడుకలకు నిషేధం.. పోలీసుల నిరంతర గస్తీ**

**ట్యాంక్‌బండ్‌పై చిన్నారి, బంధువు మృతి నేపథ్యంలో హెచ్చరిక**



**హైదరాబాద్, అక్టోబర్ 10 (చురకలు):** పుట్టినరోజు అంటే ఆనందం.. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి జరుపుకునే వేడుక. కానీ ఆ సరదానే ప్రాణాలు తీస్తే..? కేక్ కట్ చేసేందుకు వెళ్లిన వారు తిరిగి ఇంటికి రాకపోతే..? అర్ధరాత్రి వేడుకల పేరుతో జరుగుతున్న నిర్లక్ష్యం కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపుతోందని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఆందోళన వ్యక్తం చేశారు. నగరంలోని ప్రధాన రహదారులు, ట్యాంక్‌బండ్, చెరువులు, పార్కుల వద్ద అర్ధరాత్రి పుట్టినరోజు వేడుకలు నిర్వహించవద్దని నగరవాసులను హెచ్చరించారు. క్షణకాలపు ఆనందం కోసం విలువైన ప్రాణాలను ప్రమాదంలో పడేసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. మూడు రోజుల క్రితం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో ట్యాంక్‌బండ్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరేళ్ల చిన్నారి, ఆమె బంధువు ప్రాణాలు కోల్పోయిన ఘటనను సజ్జనార్ గుర్తుచేశారు. చిన్నారి పుట్టినరోజు వేడుకల సందర్భంగా ఈ విషాదం చోటుచేసుకుందని తెలిపారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారని, ప్రాణాలు కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన నేపథ్యంలో ఉన్నతాధికారులతో కలిసి ప్రమాద ప్రాంతాన్ని పరిశీలించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. సంబంధిత ప్రభుత్వ శాఖలతోనూ సమీక్ష నిర్వహించినట్లు చెప్పారు. అర్ధరాత్రి వేళ రహదారులపై పాదచారుల రాకపోకలు తక్కువగా ఉండటంతో వాహనాలు అధిక వేగంతో ప్రయాణించే అవకాశం ఉంటుందని సజ్జనార్ హెచ్చరించారు. అలాంటి సమయంలో చిన్నపిల్లలను వెంటబెట్టుకుని రోడ్లపైకి రావడం అత్యంత ప్రమాదకరమన్నారు. పుట్టినరోజు వేడుకలను కుటుంబ సభ్యుల మధ్య ఇళ్లలో లేదా ఇతర సురక్షిత ప్రదేశాల్లో నిర్వహించుకోవాలని సూచించారు. ట్యాంక్‌బండ్‌పై వేడుకల నిర్వహణకు ఇప్పటికే జీహెచ్‌ఎంసీ నిషేధాజ్ఞలు ఉన్నాయని గుర్తుచేశారు. ట్యాంక్‌బండ్ పరిసరాల్లో పోలీసులు నిరంతరం గస్తీ నిర్వహిస్తూ అర్ధరాత్రి వేడుకల కోసం వచ్చే వారిని వెనక్కి పంపిస్తున్నప్పటికీ కొందరు నిబంధనలను పట్టించుకోవడం లేదని సీపీ పేర్కొన్నారు. సరదా పేరుతో రోడ్లపై కేక్ కటింగ్‌లు చేయడం, గుంపులుగా చేరడం వల్ల ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతోందన్నారు. ఇకపై ట్యాంక్‌బండ్‌తోపాటు చెరువులు, పార్కులు, ప్రధాన రహదారులు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో అర్ధరాత్రి వేడుకలకు దూరంగా ఉండాలని సూచించారు. పుట్టినరోజు ఆనందంగా జరుపుకోవాలే తప్ప కుటుంబాలకు జీవితాంతం కన్నీళు మిగిల్చే విషాదంగా మారకూడదని సజ్జనార్ విజ్ఞప్తి చేశారు.

# హైదరాబాద్ ట్రాఫిక్‌కు ఇక చెక్!



- కొత్త రవాణా వ్యవస్థకు శ్రీకారం!
- నగర రవాణా వ్యవస్థలో భారీ మార్పులకు సర్కారు కసరత్తు
- రద్దీ ప్రాంతాల్లో సరికొత్త వ్యక్తిగత వేగవంత రవాణా వ్యవస్థ
- మెట్రో, ఎంఎంటీఎస్, బస్ స్టేషన్లతో అనుసంధానం
- కేబీఆర్ పార్కు చుట్టూ వన్‌వే.. ఫ్లైఓవర్లకు వేగం
- ఏడాదిలోగా రహదారి పనులు పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

**హైదరాబాద్, అక్టోబర్ 10 (చురకలు):** హైదరాబాద్‌లో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ఏం చేయబోతోంది..? నిత్యం రద్దీతో సతమతమవుతున్న నగరవాసులకు కొత్త ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి రానుందా..? మెట్రో, ఎంఎంటీఎస్, బస్సులతోపాటు మరో అత్యాధునిక రవాణా వ్యవస్థ నగర రోడ్లపైకి రాబోతోందా..? ఈ ప్రశ్నలకు సమాధానంగా ప్రభుత్వం సరికొత్త ప్రణాళికలపై కసరత్తు ప్రారంభించింది. మహానగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు వ్యక్తిగత వేగవంత రవాణా వ్యవస్థను ప్రవేశపెట్టే అవకాశాలను పరిశీలిస్తోంది. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో ప్రజా రవాణా సదుపాయాలను మెరుగుపరచాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రజా రవాణా, రహదారుల అనుసంధానం, శుద్ధి చేసిన నీటి పునర్వినియోగంపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో పలు కీలక సూచనలు చేశారు. నగరంలోని అత్యంత రద్దీ ప్రాంతాల్లో వ్యక్తిగత వేగవంత రవాణా వ్యవస్థ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగించే ప్రాంతాలతోపాటు పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, ఉద్యోగులకు ఉపయోగపడేలా ఈ వ్యవస్థను రూపొందించాలని సీఎం సూచించారు. మెట్రో, ఎంఎంటీఎస్, బస్ స్టేషన్లతో అనుసంధానం చేయాలని ఆదేశించారు. ప్రపంచంలోని అత్యుత్తమ రవాణా వ్యవస్థలను అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని, ముఖ్యమైన కాలనీల ఎంపిక, ఆధునిక సాంకేతికత, నిర్వహణకు ప్రాధాన్యమిస్తూ వీలైనంత త్వరగా పనులు ప్రారంభించాలని స్పష్టం చేశారు. క్యూర్ పరిధిలో రహదారుల అనుసంధానం పెంచేందుకు ఫ్లైఓవర్లు, అండర్-పాస్‌ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. కేబీఆర్ పార్కు చుట్టూ వన్‌వే విధానంతో ట్రాఫిక్ సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ కాలనీల నుంచి ప్రధాన రహదారులకు అనుసంధానం, ఫ్రీ లెఫ్ట్‌లు, యూటర్న్‌ల ఏర్పాటుపై అధికారులతో చర్చించారు. విద్యుత్, నీటి సరఫరా తదితర వ్యవస్థల తరలింపును వేగవంతం చేసి నాగార్జున సర్కిల్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వైపు ఫ్లైఓవర్ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ముంబై వంటి నగరాల్లో ఏడాదిలోపే నిర్మాణాలు పూర్తవుతున్నాయని, అక్కడి సాంకేతికతను అధ్యయనం చేసి హైదరాబాద్‌లోనూ ప్రారంభించిన పనులను ఏడాదిలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. హైదరాబాద్-ముంబై ప్రతిపాదిత బుల్లెట్ రైలు మార్గానికి సమాంతరంగా రేడియల్ రోడ్డు నిర్మాణ అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. శంకర్‌పల్లి--చేవెళ్ల మధ్య ప్రస్తుతం ఉన్న రహదారుల విస్తరణతోపాటు కొత్త రోడ్ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. మరోవైపు రోజుకు 500 మిలియన్ లీటర్ల శుద్ధి చేసిన నీటిని పునర్వినియోగించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు అధికారులు వివరించారు. భారత్ ఫ్యూచర్ సిటీ, చందన్‌వల్లి, ఆలూరులోని డేటా సెంటర్లు, ఇతర పరిశ్రమలకు ఈ నీటిని అందించేలా పనులు చేపట్టాలని సీఎం ఆదేశించారు. ఎత్తైన భవనాల నిర్మాణం, ఉద్యానవనాలు, పార్కుల నిర్వహణలోనూ శుద్ధి చేసిన నీటిని వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్యూర్ చట్టం అమలులో హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్లు, హైడ్రా, జలమండలి, హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్ల కార్యాలయాల పనులను వేగవంతం చేయాలని సూచించారు. సమావేశంలో సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, మెట్రో రైలు సలహాదారు ఎన్‌వీఎస్ రెడ్డి, అదనపు మేనేజింగ్ డైరెక్టర్ అజిత్‌రెడ్డి, కార్పొరేషన్ల కమిషనర్లు ఆర్.వి.కర్ణన్, సృజన, వినయ్‌కృష్ణారెడ్డి, జలమండలి ఎండీ అశోక్‌రెడ్డితోపాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# జీఓ 59 దరఖాస్తులకు నెల రోజుల్లో మోక్షం

**500 గజాల లోపు ప్లాట్ల దరఖాస్తులపై సర్కారు కీలక నిర్ణయం**

**పెండింగ్ దరఖాస్తుల పరిశీలనకు మెమో జారీ**



**హైదరాబాద్, అక్టోబర్ 9 (చురకలు):** ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు ఎప్పుడు మోక్షం లభిస్తుంది..? సొంత స్థలాల క్రమబద్ధీకరణ కోసం ఎదురుచూస్తున్న ప్రజలకు ఎట్టకేలకు ఊరట లభించనుందా..? తెలంగాణ ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయంతో జీఓ 59 కింద దరఖాస్తు చేసుకున్న వారికి పరిష్కారం లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. 500 చదరపు గజాల లోపు స్థలాలకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను నెల రోజుల్లోగా పరిష్కరిస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన 22-ఏ సమస్యల పరిష్కార హామీ అమలులో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. పెండింగ్ దరఖాస్తుల పరిశీలనకు ప్రభుత్వం మెమో నంబర్ 48030 జారీ చేసిందని తెలిపారు. జీఓ 59 అమలులో ఎలాంటి అక్రమాలకు అవకాశం లేకుండా నిబంధనల ప్రకారమే నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జీఓ 59 కింద గతంలో దాఖలైన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి అర్హులైన వారికి న్యాయం చేస్తామని మంత్రి తెలిపారు. గతంలో జారీ చేసిన కన్వేయన్స్ డీడ్‌లపైనా సమీక్ష నిర్వహిస్తామని వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 22-ఏ సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చిన 24 గంటల్లోనే ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. భూములు, ఇళ్లు, ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు సంబంధించి ప్రజలు ఎదుర్కొంటున్న 10 నుంచి 12 రకాల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. జీఓ 118, జీఓ 76 అమలుకు సంబంధించి కూడా స్పష్టమైన మెమోలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, డీటీసీపీ వంటి సంస్థల నుంచి ముందస్తు అనుమతులు పొందినప్పటికీ 22-ఏ నిషేధిత జాబితాలో ఉన్న ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు అనుమతి ఇస్తున్నట్లు మంత్రి పొంగులేటి ప్రకటించారు. నిబంధనలకు అనుగుణంగా ఉన్న ఆస్తుల రిజిస్ట్రేషన్లకు ఆటంకాలు తొలగించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తున్నామని, అర్హులైన దరఖాస్తుదారులకు అన్యాయం జరగకుండా చూస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో జీఓ 59 దరఖాస్తుదారులతోపాటు 22-ఏ నిషేధిత జాబితా కారణంగా రిజిస్ట్రేషన్లు నిలిచిపోయిన ఆస్తుల యజమానులకు ఊరట లభించే అవకాశం ఉంది.

# పూల పండుగకు వేళాయె..

**తెలంగాణలో బతుకమ్మ సందడాయె!**

**నేటి నుంచి తొమ్మిది రోజులపాటు బతుకమ్మ సంబరాలు**

**తంగేడు, గునుగు పూలతో ముస్తాబవుతున్న పల్లెలు, పట్టణాలు**

**ప్రకృతి ఆరాధనకు, తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా వేడుకలు**

**ఉత్సవాల నిర్వహణకు రూ.10 కోట్లు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం**

**18న సద్దుల బతుకమ్మకు ప్రత్యేక ఏర్పాట్లు**



**హైదరాబాద్, అక్టోబర్ 10 (చురకలు):** తెలంగాణ పల్లెలు పూలతో ముస్తాబవుతున్నాయి. ఇంటింటా తంగేడు, గునుగు పూల పరిమళాలు వెదజల్లుతున్నాయి. ఆడపడుచుల ఆటపాటలతో ఊరూవాడా సందడి చేసేందుకు సిద్ధమైంది. ప్రకృతిని ఆరాధిస్తూ, గౌరమ్మను కొలుస్తూ తొమ్మిది రోజులపాటు నిర్వహించే తెలంగాణ సాంస్కృతిక వైభవానికి వేళయింది. శనివారం మహాలయ అమావాస్య సందర్భంగా ఎంగిలిపూల బతుకమ్మతో ఉత్సవాలు ప్రారంభమవుతున్నాయి. ఈ నెల 18న సద్దుల బతుకమ్మతో వేడుకలు ముగియనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా బతుకమ్మ సంబరాల నిర్వహణకు ప్రభుత్వం రూ.10 కోట్లు కేటాయించినట్లు సమాచారం. గ్రామాలు,



పట్టణాలు, నగరాల్లో బతుకమ్మ ఆడే ప్రదేశాలను సిద్ధం చేయడంతోపాటు చివరి రోజు నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. దేవీ నవరాత్రుల నేపథ్యంలో ఆలయాలను సుందరంగా అలంకరించి ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

## ప్రకృతి ఒడిలో పూల పండుగ

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగకు శతాబ్దాల చరిత్ర ఉందని చరిత్రకారులు చెబుతున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత బతుకమ్మను రాష్ట్ర పండుగగా గుర్తించి అధికారికంగా నిర్వహిస్తున్నారు. తంగేడు, గునుగు, బంతి, చామంతి వంటి సహజసిద్ధమైన పూలను శంఖు ఆకారంలో పేర్చి, వాటిపై పసుపుతో తయారు చేసిన గౌరమ్మను ఉంచి మహిళలు పూజిస్తారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అందరూ బతుకమ్మ చుట్టూ చేరి చప్పట్లు కొడుతూ సంప్రదాయ పాటలు పాడటం ఈ పండుగ ప్రత్యేకత. కులమతాలు, పేదధనిక భేదాలకు అతీతంగా సామూహికంగా జరుపుకునే ఈ వేడుక తెలంగాణ ప్రజల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తోంది.

## తగ్గుతున్న తంగేడు, గునుగు పూల లభ్యత

ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో విరివిగా లభించే తంగేడు, గునుగు పూలు పట్టణీకరణ, అడవుల విస్తీర్ణం తగ్గిపోవడంతో కొన్ని ప్రాంతాల్లో అరుదుగా మారుతున్నాయి. దీంతో సంప్రదాయ పూలతోపాటు మార్కెట్లలో లభించే ఇతర పూలను కూడా బతుకమ్మల తయారీకి వినియోగిస్తున్నారు. అయినప్పటికీ పండుగ సంప్రదాయాన్ని మహిళలు కొనసాగిస్తున్నారు. బతుకమ్మ పాటల ద్వారా పూర్వీకుల ఆచారాలు, కుటుంబ బంధాలు, సామాజిక విలువలను కొత్త తరాలకు అందిస్తున్నారు.

## తెలంగాణ నుంచి ప్రపంచవ్యాప్తంగా సంబరాలు

తెలంగాణ ఉద్యమ సమయంలో బతుకమ్మ పండుగకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పెరిగింది. విదేశాల్లో స్థిరపడిన తెలంగాణ ప్రజలు కూడా ఏటా బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. గతంలో హైదరాబాద్‌లో వేలాది మంది మహిళలతో భారీ బతుకమ్మ వేడుకలు, ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈసారి కూడా రాష్ట్ర రాజధానితోపాటు అన్ని జిల్లాల్లో ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. తొమ్మిది రోజుల వేడుకల్లో చివరిదైన సద్దుల బతుకమ్మను అక్టోబర్ 18న నిర్వహించనున్నారు. మహిళలు బతుకమ్మలను ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువులు, ఇతర జలాశయాల్లో నిమజ్జనం చేయడంతో పూల పండుగ ముగియనుంది.

# ప్రజాస్వామ్యానికి గుండె చప్పుడు సమాచార హక్కు!

- పారదర్శక పాలనకు, జవాబుదారీతనానికి బలమైన పునాది
- ప్రతి సమాచార దరఖాస్తు వెనుక ఓ సమస్య.. న్యాయం కోసం ప్రయత్నం
- ప్రజలు అడగకముందే ప్రభుత్వ సమాచారం అందుబాటులో ఉంచాలి
- 15 నెలల్లో 21 వేల కేసులు పరిష్కారం.. 24 శాఖల్లో పెండింగ్ దాదాపు సున్నా
- 'సమాచార దర్పణం' ఆవిష్కరించిన గవర్నర్ శివప్రతాప్ శుక్లా




**హైదరాబాద్, అక్టోబర్ 9 (చురకలు):** ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు సామాన్యుడికి లేకపోతే ప్రజాస్వామ్యానికి అర్థమేముంటుంది? పాలనలో ఏం జరుగుతుందో తెలుసుకునే అవకాశం లేకపోతే పారదర్శకతకు విలువేముంటుంది? ఈ ప్రశ్నలకు సమాధానమే సమాచార హక్కు చట్టమని రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. సమాచార హక్కు కేవలం ఒక చట్టం మాత్రమే కాదని, ప్రజాస్వామ్యానికి హృదయ స్పందన వంటిదని అభివర్ణించారు. పారదర్శకత, జవాబుదారీతనం, పాలనలో ప్రజల భాగస్వామ్యానికి ఈ చట్టం బలమైన పునాది అని స్పష్టం చేశారు. అక్టోబర్ 5 నుంచి 12 వరకు నిర్వహిస్తున్న సమాచార హక్కు వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో రాష్ట్ర సమాచార కమిషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా సమాచార కమిషన్ రూపొందించిన 'సమాచార దర్పణం' పత్రికను ఆవిష్కరించారు. 2005లో అమల్లోకి వచ్చిన సమాచార హక్కు చట్టం సామాన్య పౌరులకు ప్రభుత్వ కార్యకలాపాలను ప్రశ్నించే అధికారాన్ని కల్పించిందని గవర్నర్ తెలిపారు. సమాచార హక్కు కింద వచ్చే ప్రతి దరఖాస్తు వెనుక ఒక సమస్య, హక్కుల కోసం అభ్యర్థన లేదా న్యాయం కోసం చేసే ప్రయత్నం ఉంటుందని పేర్కొన్నారు. అందువల్ల ఈ చట్టం విజయాన్ని కేవలం పరిష్కరించిన దరఖాస్తులు, అప్పీళ్ల సంఖ్యతో కాకుండా పాలనా వ్యవస్థలో తీసుకొచ్చిన శాశ్వత మార్పులతో అంచనా వేయాలని సూచించారు. చట్టంలోని సెక్షన్ 4(1)(బి) ప్రకారం ప్రభుత్వ శాఖలు సమాచారాన్ని ముందుగానే స్వచ్ఛందంగా వెల్లడించడం అత్యంత కీలకమన్నారు. ప్రభుత్వ పథకాలు, విధానాలు, అర్హత ప్రమాణాలు, దరఖాస్తు విధానాల వివరాలను ప్రజలకు సులభంగా అందుబాటులో ఉంచితే సమాచార హక్కు దరఖాస్తుల అవసరం తగ్గుతుందని వివరించారు. గ్రామీణ ప్రజలు, మహిళలు, దివ్యాంగులు, అట్టడుగు వర్గాలకు సమాచార హక్కు సులభంగా అందేలా చూడటం అందరి బాధ్యతని గవర్నర్ స్పష్టం చేశారు. కృత్రిమ మేధస్సు, సమాచార విశ్లేషణ, డిజిటల్ రికార్డుల నిర్వహణ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సురక్షితంగా వినియోగించడం ద్వారా సమాచార వ్యవస్థలను మరింత వేగవంతంగా, సమర్థంగా తీర్చిదిద్దవచ్చన్నారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు తెలంగాణ సమాచార కమిషన్ చేస్తున్న కృషిని అభినందించారు. అనంతరం డీజీపీ సీవీ ఆనంద్ సమాచార హక్కు ప్రతిజ్ఞ చేయించారు. రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ జి.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కేవలం 15 నెలల్లో 30 వేల కేసులకు గాను 21 వేల కేసులను పరిష్కరించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని 24 శాఖల్లో పెండింగ్ కేసులను దాదాపు సున్నా స్థాయికి తీసుకొచ్చామని తెలిపారు. తక్షణ సమాచారం కోరుకునే నేటి యువత, ముఖ్యంగా నవతరం అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ శాఖలు ముందుగానే సమాచారాన్ని వెల్లడించాలన్నారు. సమర్థవంతమైన ఆన్‌లైన్ సమాచార హక్కు వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ప్రజలకు మరింత సౌలభ్యం కలుగుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా రెవెన్యూ, పురపాలక శాఖల్లో అనవసర వివాదాలు, అప్పీళ్లను తగ్గించడంతోపాటు గ్రామీణ ప్రజలు, మహిళలు సమాచార హక్కును విస్తృతంగా వినియోగించుకునేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. సమాచార హక్కు అమలులో ఉత్తమ పనితీరు కనబరిచిన అధికారులు, శాఖలకు గవర్నర్ పురస్కారాలు ప్రదానం చేశారు. ఉత్తమ స్వచ్ఛంద సమాచార వెల్లడి విభాగంలో నల్గొండ కలెక్టర్ చంద్రశేఖర్, మహబూబాబాద్ మున్సిపల్ కమిషనర్ వినోద్‌కుమార్, తెలంగాణ జెన్‌కో సీఎండీ హరీష్ అవార్డులు అందుకున్నారు. ఉత్తమ పనితీరు కనబరిచిన జిల్లాల విభాగంలో భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ అంకిత్, సూర్యాపేట కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ పురస్కారాలు స్వీకరించారు. ఉత్తమ శాఖాధిపతిగా గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్, ఉత్తమ సచివాలయ శాఖ విభాగంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా అవార్డులు అందుకున్నారు. ఉత్తమ ప్రజా సమాచార అధికారులుగా ఖమ్మం జిల్లా రెవెన్యూ అధికారి రామమూర్తి, నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ నసీర్, మహబూబ్‌నగర్ జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి పురస్కారాలు అందుకున్నారు. ప్రత్యేక విభాగంలో ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, రామగుండం తహసీల్దార్ రవీందర్ అవార్డులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుభాష్‌రెడ్డి, అటవీ శాఖ ప్రధాన సంరక్షణాధికారి వినయ్‌కుమార్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా, సాధారణ పరిపాలన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బెన్‌హర్ మహేశ్ దత్ ఎక్కా, రాష్ట్ర సమాచార కమిషనర్లు పి.వి.శ్రీనివాసరావు, మొహసినా పర్వీన్, దేశాల భూపాల్, వైష్ణవి మెర్ల, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌తోపాటు ప్రభుత్వ ఉన్నతాధికారులు, వివిధ శాఖల ప్రజా సమాచార అధికారులు, ప్రథమ అప్పీళ్ల అధికారులు పాల్గొన్నారు.



## 'గ్లోబల్ కాన్ఫిడెన్స్ సెంటర్'గా
# హైదరాబాద్

ప్రపంచస్థాయి సమస్యలకు పరిష్కారాలు కనుగొనే 'ఎకో సిస్టమ్'

గ్లోబల్ కంపెనీల అవసరాలకనుగుణంగా అడ్వాన్స్‌డ్ డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్

ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, అక్టోబర్ 9 (చురకలు):**గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల గమ్యస్థానంగానే కాక హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి సమస్యలకు పరిష్కారాలు కనుగొనే 'గ్లోబల్ కాన్ఫిడెన్స్ సెంటర్'గా తీర్చిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. గ్లోబల్ మార్కెట్ అవసరాలు, సవాళ్లు, భవిష్యత్ సాంకేతిక మార్పులకు అనుగుణంగా దిగ్గజ కంపెనీలను ఆకర్షించే కాంప్రెహెన్సివ్ ఎకో సిస్టంను రాష్ట్రంలో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. హైటెక్ సిటీలో 30వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన నెదర్లాండ్స్ గ్లోబల్ ఫిన్‌టెక్ దిగ్గజం 'బ్యాక్‌బేస్' డెవలప్ మెంట్ సెంటర్‌ను ఆయన శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఆనతికాలంలోనే టెక్నాలజీ, డిజిటల్ బ్యాంకింగ్, ఫిన్‌టెక్ రంగాల్లో హైదరాబాద్‌ను గ్లోబల్ కంపెనీలకు ఒక ప్రముఖ గమ్యస్థానంగా తీర్చిదిద్దామన్నారు. బ్యాక్‌బేస్ లాంటి దిగ్గజ కంపెనీల విస్తరణే ఇందుకు నిదర్శనమన్నారు. కేవలం పెట్టుబడులను ఆకర్షించడం, పెద్ద కంపెనీలను రప్పించడమే కాకుండా డిజిటల్ బ్యాంకింగ్ సొల్యూషన్స్, సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ అండ్ ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ, డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ లాంటి రంగాల్లో ఉపాధి అవకాశాలను దక్కించుకునేలా తెలంగాణ యువతను సంసిద్ధం చేయడంపై ప్రధానంగా దృష్టి సారించామన్నారు. గ్లోబల్ కంపెనీల అవసరాలకు అనుగుణంగా రాష్ట్రంలో అడ్వాన్స్డ్ డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను అందుబాటులోకి తెచ్చేలా ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తున్నామన్నారు. సమాజం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారాలు చూపే సత్తా టెక్నాలజీకి ఉందని, ఆ దిశగా కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలతో ముందుకొచ్చే వారికి ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు నెక్స్ట్ జనరేషన్ డిజిటల్ బ్యాంకింగ్ సొల్యూషన్స్, సాఫ్ట్ వేర్ ఉత్పత్తులను అందించడంలో ఈ బ్యాక్‌బేస్ డెవలప్‌మెంట్ సెంటర్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఇక్కడ కొత్తగా 300మంది హై-స్కిల్డ్ వర్క్‌ఫోర్స్‌కు ఉద్యోగాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో నెదర్లాండ్స్ డిప్యూటీ కాన్సుల్ జనరల్ యాన్ క్రెమర్స్, బ్యాక్‌బేస్ సీటీఓ గ్రెగ్ ఫాహి, చీఫ్ ఆఫ్ స్టాఫ్ రీన్‌హార్డ్ షీల్, ఇండియా సైట్ హెడ్ సురభి శర్మ తదితరులు పాల్గొన్నారు.

# కల నెరవేరి పదేళ్లు పూర్తి




- నాటి గోడ మీద రాతలే నేడు నిజయమ్యాయి
- జిల్లా కోసం ఎన్టీఆర్ కు వినతిపత్రం ఇచ్చిన కేసీఆర్
- అదే కేసీఆర్ సీఎంగా సిద్దిపేట జిల్లా ఏర్పాటు
- రైలు, గోదావరి జలాలు సిద్దిపేటకు వచ్చాయి
- సిద్దిపేట దశాబ్ది ఉత్సవాల్లో హరీశ్ రావు

**సిద్దిపేట, అక్టోబర్ 9:** సిద్దిపేట జిల్లాగా ఆవిర్భవించి పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా సిద్దిపేట జిల్లా దశాబ్ది ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన 10కె రన్ ను మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు జెండా ఊపి ప్రారంభించారు. ఉదయాన్నే ఆహ్లాదకరమైన వాతావరణంలో వేలాదిమంది యువతీయువకులు, క్రీడాకారులు, విద్యార్థులు, పట్టణ ప్రముఖులు ఈ పరుగులో ఉత్సాహంగా పాల్గొన్నారు. హరీశ్ రావు కూడా 10కె రన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా అనేది ఒక దశాబ్దాల కల. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా సిద్దిపేట జిల్లా చేస్తామని 30 ఏళ్లు, 40 ఏళ్లు గోడల మీద రాతలు, ఎన్నికల నినాదాలు, కరపత్రాలు చూశాం. కానీ ఆ కలను నిజం చేసుకున్న రోజు 2016 అక్టోబర్ 11 అని గుర్తు చేశారు. 2026 అక్టోబర్ 11నాటికి మన సిద్దిపేట జిల్లాకు 10 ఏళ్లు నిండుతున్నాయి. పదేళ్లు నిండుతున్న పండుగలో మీరందరూ ఈ 10కె రన్‌లో పాల్గొనడానికి రావడం చాలా సంతోషమన్నారు. ఈ రన్ ఎంత వేగంగా జరుగుతుందో మన సిద్దిపేట జిల్లా కూడా అంతే వేగంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. ఇన్ని స్పోర్ట్స్ క్లబ్స్ వచ్చాయంటే, ఇంత గొప్ప క్రీడా మైదానాలు ఇక్కడ ఏర్పడ్డాయంటే, ఇన్ని జిల్లా కార్యాలయాలు ఇక్కడ వచ్చాయంటే, సిద్దిపేట ఇంత వేగంగా అభివృద్ధి జరిగిందంటే అది కేవలం జిల్లా ఏర్పడడం వల్లే సాధ్యమైందన్నారు. ఇక్కడ తమ పీఈటీ టీచర్లు కనబడుతున్నారు, స్పోర్ట్స్ క్లబ్స్ వాళ్లు కనబడుతున్నారు.. ఆ రోజుల్లో ఉపాధ్యాయుల బదిలీలు ఉంటే పొద్దున్నే 5 గంటలకు బస్సెక్కి సంగారెడ్డి పోయి ఎన్ని రకాల బాధలు పడ్డారో నాకంటే ఎక్కువ అనుభవించిన వాళ్లకే బాగా తెలుసన్నారు. నాడు కానిస్టేబుల్ పరీక్ష రాయడానికి సంగారెడ్డిలో పొద్దున్నే 8 గంటలకు రన్నింగ్ టెస్ట్, హై జంప్, లాంగ్ జంప్ టెస్ట్ ఉంటే రాత్రి పోయి బస్టాండ్‌లో పడుకుని, దోమలు కుడుతుంటే ఎంతో ఇబ్బంది పడి ఉదయం రన్నింగ్‌లో పాల్గొన్నామని మొన్న ఒక కానిస్టేబుల్ తనతో చెప్పారన్నారు. ఇవాళ జిల్లా ఏర్పడ్డ తర్వాత అది ఎంసెట్ పరీక్ష అయినా, ఇంకే పరీక్షలైనా సిద్దిపేటలోనే మనం చేసుకోగలుగుతున్నామన్నారు. ముఖ్యంగా మంచిర్యాల జిల్లా, సిద్దిపేట జిల్లా, మెదక్ జిల్లా ఇలా ప్రజలకు ఎన్నో కోరికలు ఉండేవి. ఆ 33 జిల్లాల కలను నిజం చేసి 33 అభివృద్ధి కేంద్రాలను తీర్చిదిద్దిన ఘనత ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ కే దక్కుతుంది. జిల్లా ఏర్పడకముందు సిద్దిపేట ఎట్లా ఉండేది? జిల్లా ఏర్పడ్డ తర్వాత ఎట్లా మారింది? రేపటి సిద్దిపేట ఎలా ఉండాలో కల కనాలి.. ఆ కలను నిజం చేసుకోవడం కోసం మనమందరం కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఏదైనా ఆకాంక్ష లేకపోతే దానికి ఒక రూపం ఉండదు. జిల్లా కావాలనే ఆకాంక్ష 1983లోనే మొదలైంది. 1983లో అప్పట్లో నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ సిద్దిపేటకు వచ్చారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా సిద్దిపేటకు వస్తే అంబేద్కర్ స్టాచ్యూ దగ్గర కేసీఆర్ సిద్దిపేట జిల్లా ఏర్పాటు చేయాలని చెప్పి దరఖాస్తును ఎన్టీఆర్ కు ఇచ్చారు. ఏ చేత్తోనైతే ఎన్టీఆర్ కు దరఖాస్తు ఇచ్చారో తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా అదే చేత్తో సంతకం పెట్టి కేసీఆర్ సిద్దిపేట జిల్లాను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. 1983 నుంచి 2016 అంటే 30 ఏళ్ల తర్వాత తానే ముఖ్యమంత్రిగా ఈ జిల్లాను ఏర్పాటు చేశారన్నారు. ఒకప్పుడు మనకు మూడు నినాదాలు ఉండేవి.. సిద్దిపేట జిల్లా కావాలి, సిద్దిపేటకు రైలు రావాలి, సిద్దిపేటకు గోదావరి జలాలు రావాలి. ఈ మూడు కూడా ఇవాళ కళ్లముందు నిజమైనాయి కదా. కళ్లముందు రంగనాయక సాగర్‌లో గోదావరి జలాలు కనబడుతున్నాయి. ఇటు నర్సాపూర్ వైపు చూస్తే పొద్దున్నే చుక్ చుక్ రైలు కనబడుతుంది. ఇటు సిద్దిపేట జిల్లా ఏర్పడి కలెక్టర్, సీపీ, జిల్లా కార్యాలయాలతో అద్భుతమైన సిద్దిపేటను మనం ఆవిష్కరించుకోగలిగాం అని చెప్పారు. మెడికల్ కాలేజ్, నర్సింగ్ కాలేజ్, ఫార్మసీ కాలేజ్, పారామెడికల్ కాలేజ్, పాలిటెక్నిక్ కాలేజ్, బీ-ఫార్మసీ కాలేజ్, ఉమెన్స్ డిగ్రీ కాలేజ్, పీజీ కాలేజ్, మేనేజ్‌మెంట్ కాలేజ్.. ఇట్లా ఎన్నెన్నో కాలేజీలు తెచ్చుకున్నాం. రేపటి సిద్దిపేటలో ఒక యూనివర్సిటీ రావాలి.. ఇదొక్కటే ఇక మనకు తక్కువ ఉన్నది. ఆ యూనివర్సిటీని కూడా తప్పకుండా సాధించుకుందాం.. ఆ దిశగా మనం అడుగులు వేద్దాం, ఆ దిశగా ప్రయాణిద్దాం, ఆ దిశగా మన పిల్లలకు ఉజ్వలమైన భవిష్యత్తును ఆవిష్కరించుకుందాం అని హరీశ్‌రావు అన్నారు.న్నారు.

# ఎల్లుండి మంత్రులతో సీఎం ప్రత్యేక సమావేశం

ఎల్‌నినో ప్రభావం, వర్షాభావంపై చర్చ



**హైదరాబాద్, అక్టోబర్ 9 (చురకలు):** రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఈ నెల 12వ తేదీన మంత్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. వర్షపాతం తగ్గిన ప్రాంతాల్లో పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రభుత్వం చేపట్టాల్సిన తక్షణ చర్యలపై చర్చించనున్నారు. వ్యవసాయం, సాగునీరు, తాగునీటి సరఫరా, పెరిగిన విద్యుత్ డిమాండ్, తక్షణ అవసరాలపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో వర్షాభావ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో సాధారణం కంటే 17 శాతం తక్కువ వర్షపాతం నమోదు కాగా, దాదాపు 235 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. కరువు మండలాల ప్రకటనతోపాటు తగినంత ఆర్థిక సాయం అందించాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని కోరింది. వర్షాభావ ప్రాంతాల్లో చేపట్టాల్సిన సహాయక చర్యలు, ఇప్పటికే మంత్రివర్గ ఉపసంఘం రూపొందించిన కార్యాచరణ, అఖిలపక్ష సమావేశం, రైతు సంఘాలు, వివిధ రంగాల నిపుణుల సలహాలు, సూచనలపై ముఖ్యమంత్రి నిర్వహించే సమావేశంలో చర్చించే అవకాశముంది.

# స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల బదిలీలు




**హైదరాబాద్, అక్టోబర్ 9 (చురకలు):** వివిధ జిల్లాల్లో పనిచేస్తున్న రెవెన్యూ అధికారులను ప్రభుత్వం బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లను బదిలీ చేసింది. జగిత్యాల అడిషనల్ కలెక్టర్ గా పనిచేస్తున్న బీ.రాజుగౌడ్ ను నిజామాబాదు, తెలంగాణ సీఈవో కార్యలయంలో డిప్యూటేషన్ పై ఉన్న స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ఎన్. ప్రసూనాంబను జగిత్యాల అడిషనల్ కలెక్టర్ గా బదిలీ చేశారు. ఆర్అండ్ బీ, హౌజింగ్ లో పనిచేస్తున్న డి.వెంకట మాధవరావును నిర్మల్ అడిషనల్ కలెక్టర్,గా మహబూబ్ నగర్ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న పి.రాంరెడ్డిని వనపర్తి డీఆర్వోగా బదిలీ చేశారు. పో స్టింగ్ వెయిటింగ్ లిస్ట్ లో ఉన్న పి.యాదగిరిని మహబూబ్ నగర్ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ గా, మోహన్ సింగ్ ను రాజన్న సిరిసిల్ల గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. పి.పద్మప్రియను మెట్రో రైలు విభాగానికి డిప్యూటీషన్ పై బదిలీ చేశారు. సీహెచ్. కృష్ణయ్య ను మేడ్చల్ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ గా బదిలీ చేశారు.

# అంగన్‌వాడీ కేంద్రాలకు 12 రోజుల సెలవులు

**హైదరాబాద్, అక్టోబర్ 9 (చురకలు):** మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు బతుకమ్మ, దసరా పండుగ సందర్భంగా రాష్ట్రంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు ఈనెల 10 నుంచి 21వ తేదీ వరకు 12 రోజులపాటు సెలవులు ప్రకటించారు. ఈ మేరకు మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆదేశాలు జారీ చేసింది. సెలవుల కాలంలో లబ్దిదారులకు సాధారణంగా అందించే వేడి భోజనం (హాట్ కుక్డ్ మీల్)కు బదులుగా టేక్ హోమ్ రేషన్ పంపిణీకి అనుమతి ఇచ్చారు. 22వ తేదీ నుంచి రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలు యథావిధిగా పనిచేస్తాయి. ఈ మేరకు తమ పరిధిలోని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు, హెల్పర్లకు అవసరమైన సూచనలు జారీ చేయాలని జిల్లా సంక్షేమ అధికారులు, శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారులను శాఖ ఆదేశించింది. ప్రభుత్వ పాఠశాలల టీచర్ల మాదిరిగానే తమకు బతుకమ్మ, దసరా సెలవులు మంజూరు చేసినందుకు అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు మంత్రి సీతక్కకు ధన్యవాదాలు తెలిపారు. అంగన్‌వాడీ చరిత్రలోనే మొదటిసారిగా దసరా సెలవులు ఇచ్చి అంగన్‌వాడీ టీచర్స్‌ని, హెల్పర్స్‌ని బతుకమ్మ సంబరాలు సంబరంగా చేసుకోమని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్కకు ఇందిరా ప్రియదర్శిని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(ఐఎన్‌టియుసి) రాష్ట్ర అధ్యక్షురాలు డి.అన్నపూర్ణ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.




# 6 వేల హెచ్-1బీ వీసాల లెక్క చెబుతాం!

**అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఆరోపణలకు మైక్రోసాఫ్ట్ కౌంటర్**

**80 శాతం దరఖాస్తులు కొత్త నియామకాల కోసం కాదని స్పష్టీకరణ**

**ఉద్యోగులను తొలగించి విదేశీయులకు అవకాశాలిస్తున్నారన్న వాన్స్**

**అమెరికా ఉద్యోగులకే అధిక ప్రాధాన్యమిస్తున్నామని సంస్థ వివరణ**

**వీసాలు, గ్రీన్‌కార్డులపై అమెరికాలో ముదురుతున్న వివాదం**

**వాషింగ్టన్, అక్టోబర్ 9 (చురకలు):** అమెరికాలో ఉద్యోగుల తొలగింపులు, విదేశీ నిపుణులకు హెచ్-1బీ వీసాల మంజూరు వ్యవహారం మరోసారి వివాదాస్పదమైంది. అమెరికన్ ఉద్యోగులను తొలగిస్తూ విదేశీయులకు పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారంటూ అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ చేసిన ఆరోపణలకు ప్రముఖ సాంకేతిక సంస్థ మైక్రోసాఫ్ట్ స్పందించింది. గత ఆర్థిక సంవత్సరంలో దాఖలు చేసిన ఆరు వేల హెచ్-1బీ వీసా దరఖాస్తుల వివరాలను ప్రభుత్వానికి అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించింది. తమ సంస్థలో అత్యధిక శాతం ఉద్యోగులు అమెరికన్లేనని, అమెరికా శ్రామిక శక్తి, ప్రతిభపై పూర్తి విశ్వాసం ఉందని స్పష్టం చేసింది. విదేశీ నిపుణుల నియామకాల్లో ప్రభుత్వ నిబంధనలను పాటిస్తున్నామని, వీసా వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్నామన్న ఆరోపణలను తోసిపుచ్చింది. గత ఆర్థిక సంవత్సరంలో తమ సంస్థ సుమారు ఆరు వేల హెచ్-1బీ వీసా పిటిషన్లు దాఖలు చేసిందని మైక్రోసాఫ్ట్ వెల్లడించింది. వీటిలో 80 శాతం దరఖాస్తులు ఇప్పటికే సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల విధులు, ఉద్యోగ పరిస్థితుల్లో మార్పులకు సంబంధించినవేనని వివరించింది. కొత్తగా విదేశీయులను నియమించుకునేందుకు ఉద్దేశించినవి కావని స్పష్టం చేసింది. మిగిలిన దరఖాస్తులు కూడా ఇప్పటికే చట్టబద్ధంగా అమెరికాలో నివసిస్తూ తమ సంస్థలో ఉద్యోగాలు చేపట్టేందుకు వచ్చిన వ్యక్తులకు సంబంధించినవేనని తెలిపింది. వీరంతా అమెరికాకు కొత్తగా వచ్చినవారు కాదని పేర్కొంది. అమెరికాలో తమ సంస్థ మొత్తం ఉద్యోగులతో పోలిస్తే ఈ విభాగానికి చెందిన వారి సంఖ్య సుమారు ఒక శాతం మాత్రమేనని వివరించింది. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అర్హత కలిగిన విదేశీ నిపుణుల కోసం మాత్రమే హెచ్-1బీ పిటిషన్లు దాఖలు చేస్తున్నామని తెలిపింది. మైక్రోసాఫ్ట్ ఉద్యోగ నియామకాల తీరుపై అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 2025లో సంస్థ సుమారు ఆరు వేల మంది అమెరికన్ ఉద్యోగులను తొలగించిందని ఆరోపించారు. అదే సమయంలో 6,300 హెచ్-1బీ వీసాలను పొందడంతోపాటు దాదాపు మూడు వేల గ్రీన్‌కార్డులను కూడా సాధించిందని పేర్కొన్నారు. ఈ గణాంకాలను పరిశీలిస్తే తొలగించిన ప్రతి అమెరికన్ ఉద్యోగి స్థానంలో సగటున ఒకటిన్నర మంది విదేశీ ఉద్యోగులకు అవకాశాలు కల్పించినట్లు కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. అమెరికన్ ఉద్యోగుల ప్రయోజనాలను పక్కనపెట్టి విదేశీ కార్మికులపై ఆధారపడటం సమంజసం కాదని అభిప్రాయపడ్డారు. అయితే ఉద్యోగుల తొలగింపులు, వీసా పిటిషన్లు, గ్రీన్‌కార్డు ప్రక్రియలను నేరుగా ఒకదానితో మరొకటి పోల్చడం సరికాదన్నది మైక్రోసాఫ్ట్ వివరణలోని ప్రధాన అంశంగా నిలిచింది. అమెరికాలో శాశ్వత ఉద్యోగాల కోసం నిర్వహించే కార్మిక ధ్రువీకరణ ప్రక్రియపైనా వాన్స్ అనుమానాలు వ్యక్తం చేశారు. ఉద్యోగ ఖాళీలకు సంబంధించి పెద్దగా ప్రచారం లేని పత్రికల్లో ప్రకటనలు ఇచ్చి, అమెరికన్ అభ్యర్థుల నుంచి తగిన స్పందన రాలేదనే కారణంతో విదేశీ ఉద్యోగులకు అవకాశాలు కల్పిస్తున్నారని ఆరోపించారు. ఈ విధంగా అమెరికన్ ఉద్యోగులకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన నిబంధనల ఉద్దేశాన్ని దెబ్బతీస్తున్నారని విమర్శించారు. పర్మనెంట్ లేబర్ సర్టిఫికేషన్ కార్యక్రమం కింద కంపెనీలు అమెరికన్ ఉద్యోగుల లభ్యతను పరిశీలించాల్సి ఉంటుందని, ఈ ప్రక్రియను దుర్వినియోగం చేయకుండా చూడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వాన్స్ ఆరోపణల నేపథ్యంలో మైక్రోసాఫ్ట్ తన వీసా దరఖాస్తుల వివరాలను ప్రభుత్వానికి సమర్పించేందుకు సిద్ధమని ప్రకటించింది. అమెరికన్ ఉద్యోగులకే సంస్థలో ప్రధాన ప్రాధాన్యం ఉందని పునరుద్ఘాటించింది. విదేశీ నిపుణుల నియామకాలు చట్టబద్ధంగా జరుగుతున్నాయని, ఇప్పటికే అమెరికాలో పనిచేస్తున్న ఉద్యోగుల వీసా స్థితికి సంబంధించిన మార్పులను కొత్త నియామకాలుగా పరిగణించరాదని వివరించింది. తమ నియామక విధానాలపై ప్రభుత్వానికి అవసరమైన అదనపు సమాచారం అందిస్తామని తెలిపింది. అమెరికాలోని సాంకేతిక సంస్థలు విదేశీ నిపుణులను నియమించుకునేందుకు హెచ్-1బీ వీసా విధానాన్ని విస్తృతంగా ఉపయోగిస్తున్నాయి. ముఖ్యంగా సమాచార సాంకేతికత, ఇంజినీరింగ్, పరిశోధన వంటి ప్రత్యేక నైపుణ్యాలు అవసరమైన రంగాల్లో ఈ వీసాలకు ప్రాధాన్యం ఉంది. అయితే అమెరికన్ ఉద్యోగుల తొలగింపులు కొనసాగుతున్న సమయంలో విదేశీ ఉద్యోగుల నియామకాలపై రాజకీయంగా అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో మైక్రోసాఫ్ట్‌పై జేడీ వాన్స్ చేసిన ఆరోపణలు, సంస్థ ఇచ్చిన వివరణ అమెరికాలో ఉద్యోగ అవకాశాలు, వలస విధానాలపై జరుగుతున్న చర్చకు మరింత ప్రాధాన్యం కల్పించాయి. విదేశీ నిపుణుల అవసరాలను తీర్చడంతోపాటు స్థానిక ఉద్యోగుల ప్రయోజనాలను ఎలా పరిరక్షించాలన్న అంశం ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది.

## ట్రంప్‌కు దక్కని నోబెల్ 'శాంతి'..

**వాషింగ్టన్, అక్టోబర్ 9 (చురకలు):** నోబెల్ శాంతి బహుమతి పొందేందుకు తాను అర్హుడనని.. అది తనకు వస్తుందనే నమ్మకం మాత్రం తక్కువేనని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దక్షిణాఫ్రికాకు చెం దిన నవనీతమ్ పిళ్లైకు ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు రావడంపై ట్రంప్ పరోక్షంగా స్పందించారు. ఆయనకు మద్దతుగా ఓ సీనియర్ న్యాయవాది ట్రూత్ సోషల్‌లో పెట్టిన పోస్టును రీపోస్టు చేసిన ఆయన.. నోబెల్ శాంతి దక్కకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. 'అమెరికా, ఇజ్రాయెల్‌ను బహిరంగంగా ద్వేషించే వ్యక్తి నవనీతమ్ పిళ్లై. శాంతిని పెంచడానికి ఆమె ఎన్నడూ ప్రయత్నించలేదు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగిం చడానికి.. ఇరాన్‌ను అడ్డుకోవడానికి ట్రంప్ శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. గాజాను



పునర్నిర్మించడానికి కృషి చేస్తున్నారు. అసాధ్యం అనుకున్న అబ్రహం ఒప్పందాన్ని అందించారు. ఇప్పుడు దాన్ని విస్తరిస్తున్నారు. నోబెల్ శాంతి బహుమతికి ఇలాంటి విషయాలను గుర్తించాల్సింది" అని అమెరికాకు చెందిన సీనియర్ అటార్నీ డేవిడ్ షోయెన్ పెట్టిన పోస్టుపై ట్రంప్ స్పందించారు. అంతర్జాతీయ నేర న్యాయస్థానం మాజీ న్యాయమూర్తి నవీ పిళ్లైకు ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి బహుమతి వచ్చిన కొన్ని గంటల్లోనే ఆ సంస్థపై ట్రంప్ సర్కార్ ఆంక్షలు విధించింది. అమెరికా పౌరులపై విచారణ జరపకుండా నిరోధిస్తున్నట్లు పేర్కొంది. ఐసీసీతో లావాదేవీలు నిషేధిస్తామని, వనరులను నిలిపివేసి, దాని కార్యకలాపాలను దెబ్బతీస్తామని స్పష్టం చేసింది.

# ఢిల్లీలో నిరసనల సెగ..



- అర్ధరాత్రి నుంచి ఇంటర్నెట్ బంద్?
- జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా డిమాండ్‌తో నేడు ధర్నాకు పిలుపు
- అనుమతి నిరాకరించినా ఆందోళనకు సిద్ధమంటున్న సీజేపీ
- 57 మెట్రో స్టేషన్ల మూసివేత.. భారీ బందోబస్తు అంటూ ప్రచారం
- కేంద్ర ఢిల్లీలో నిషేధాజ్ఞలు.. పోలీసుల అప్రమత్తత
- నిరసనలపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన పార్టీ

**న్యూఢిల్లీ, అక్టోబర్ 9 (చురకలు):** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలంటూ కాక్రోచ్ జనతా పార్టీ శనివారం చేపట్టనున్న భారీ నిరసన నేపథ్యంలో దేశ రాజధాని ఢిల్లీ అట్టుడుకుతోంది. జంతర్‌మంతర్ వద్ద ఆందోళనకు పోలీసులు అనుమతి నిరాకరించినప్పటికీ నిరసన నిర్వహించి తీరుతామని నిర్వాహకులు ప్రకటించడంతో కేంద్ర ఢిల్లీని భద్రతా బలగాలు తమ ఆధీనంలోకి తీసుకుంటున్నాయి. వేలాది మంది పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలను మోహరించడంతోపాటు ప్రధాన రహదారుల్లో బారికేడ్లు ఏర్పాటు చేశారు. శుక్రవారం రాత్రి 10 గంటల నుంచి శనివారం రాత్రి 10 గంటల వరకు జనపథ్--కర్తవ్యపథ్ కూడలి నుంచి నాలుగు కిలోమీటర్ల పరిధిలో మొబైల్ ఇంటర్నెట్ సేవలను నిలిపివేయాలని అధికారులు ఆదేశించారు. మరోవైపు 57 మెట్రో స్టేషన్ల ప్రవేశ, నిష్క్రమణ ద్వారాలపై ఆంక్షలు విధించడంతో ప్రజా రవాణాపై తీవ్ర ప్రభావం పడే పరిస్థితి నెలకొంది. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయన్న ఆరోపణలతో ప్రారంభమైన నిరసన ఇప్పుడు దేశ రాజధానిలో రాజకీయ ఉద్రిక్తతలకు దారితీసింది. నిరసన నేపథ్యంలో శుక్రవారం రాత్రి 10 గంటల నుంచి 24 గంటలపాటు కేంద్ర ఢిల్లీలోని నిర్దేశిత ప్రాంతాల్లో మొబైల్ ఇంటర్నెట్ సేవలను నిలిపివేయాలని అధికారులు నిర్ణయించారు. జనపథ్-కర్తవ్యపథ్ కూడలి కేంద్రంగా నాలుగు కిలోమీటర్ల పరిధిలో ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయి. అయితే ఢిల్లీ నగరమంతటా ఇంటర్నెట్ నిలిపివేస్తున్నట్లు జరుగుతున్న ప్రచారం సరికాదని, ఆంక్షలు నిర్దేశిత ప్రాంతాలకే పరిమితమని వెల్లడైంది. భద్రతా పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

### 57 మెట్రో స్టేషన్లపై ఆంక్షలు

నిరసనకారులు పెద్ద సంఖ్యలో జంతర్‌మంతర్‌కు చేరుకునే అవకాశముందని భావిస్తున్న పోలీసులు మెట్రో రవాణాపైనా నియంత్రణ చర్యలు చేపట్టారు. శుక్రవారం రాత్రి 9 గంటల నుంచి 57 మెట్రో స్టేషన్ల ప్రవేశ, నిష్క్రమణ ద్వారాలను తాత్కాలికంగా మూసివేయాలని నిర్ణయించారు. న్యూఢిల్లీ మెట్రో స్టేషన్ మినహా మిగిలిన ప్రభావిత స్టేషన్లలో రైళ్లు మారే సదుపాయం కొనసాగుతుందని మెట్రో అధికారులు వెల్లడించారు. న్యూఢిల్లీ, హజ్రత్ నిజాముద్దీన్ రైల్వే స్టేషన్లకు సంబంధించిన పలు రైలు సర్వీసులపైనా ఆంక్షలు ప్రభావం చూపుతున్నాయి. ప్రయాణికులు ముందుగానే తమ ప్రయాణ వివరాలను పరిశీలించుకోవాలని సూచనలు జారీ అయ్యాయి.

### భారీ బలగాలతో ఢిల్లీకి భద్రతా వలయం

ఆందోళన నేపథ్యంలో ఢిల్లీలో 23 వేల మందికి పైగా పోలీసు సిబ్బందిని మోహరించినట్లు వార్తలు వెల్లడించాయి. జంతర్‌మంతర్, జనపథ్, కర్తవ్యపథ్‌తోపాటు ప్రభుత్వ కార్యాలయాలు, ముఖ్య కూడళ్ల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. కేంద్ర ఢిల్లీలో నిషేధాజ్ఞలు విధించారు. హోటళ్లు, అతిథి గృహాల్లో తనిఖీలు చేపట్టడంతోపాటు నగరంలోకి వచ్చే వాహనాల రాకపోకలను పర్యవేక్షిస్తున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని పోలీసులు చెబుతున్నారు.

### అనుమతి నిరాకరించినా వెనక్కి తగ్గేది లేదంటున్న సీజేపీ

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణలో భారీగా పేర్లు తొలగించారని ఆరోపిస్తూ కాక్రోచ్ జనతా పార్టీ నిరసనకు పిలుపునిచ్చింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. అయితే నిరసనకు సంబంధించిన దరఖాస్తు ఆలస్యంగా అందిందని, గతంలో జరిగిన ఆందోళనల్లో నిబంధనల ఉల్లంఘనలు చోటుచేసుకున్నాయని పేర్కొంటూ ఢిల్లీ పోలీసులు అనుమతి నిరాకరించారు. అయినప్పటికీ శాంతియుత నిరసన నిర్వహిస్తామని పార్టీ ప్రతినిధులు ప్రకటించారు. వివిధ ప్రాంతాల నుంచి ఢిల్లీకి బయలుదేరిన కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుంటున్నారని నిర్వాహకులు ఆరోపిస్తున్నారు.

### నియంత్రణలపై సుప్రీంకోర్టు స్పందన

నిరసన నేపథ్యంలో రైళ్లు, మెట్రో సేవలపై విధించిన విస్తృత ఆంక్షలు ప్రజలకు ఇబ్బందులు కలిగించే అవకాశం ఉందన్న అంశంపై సుప్రీంకోర్టులోనూ చర్చ జరిగింది. శాంతిభద్రతలను కాపాడే బాధ్యత ప్రభుత్వంపై ఉన్నప్పటికీ ప్రజాజీవనాన్ని పూర్తిగా స్తంభింపజేసేలా చర్యలు ఉండకూడదని న్యాయస్థానం అభిప్రాయపడినట్లు వార్తలు వెల్లడించాయి. నిరసనల నియంత్రణకు అవసరమైన మేరకే చర్యలు చేపట్టాలన్న అంశం ప్రాధాన్యం సంతరించుకుంది.

## భారత సంతతి నవనీతమ్ నవీ పిళ్లైకి నోబెల్ శాంతి బహుమతి

**ఓస్లో/న్యూఢిల్లీ, అక్టోబర్ 9 (చురకలు):** అంతర్జాతీయ చట్టాల పరిరక్షణ, మానవ హక్కుల పరివర్తన, ప్రపంచ శాంతి స్థాపనకు దశాబ్దాలుగా అంకితభావంతో సేవలందిస్తున్న దక్షిణాఫ్రికాకు చెందిన భారతీయ తమిళ సంతతి ప్రముఖ న్యాయకోవిదురాలు నవనీతమ్ "నవీ" పిళ్లైకి ప్రతిష్టాత్మక 'నోబెల్ శాంతి బహుమతి-2026' లభించింది. మానవ హక్కుల పరిరక్షణలో ఆమె చేసిన అసమాన కృషికి గాను ఈ అత్యున్నత పురస్కారాన్ని అందజేస్తున్నట్లు నార్వేజియన్ నోబెల్ కమిటీ శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. దక్షిణాఫ్రికాలోని డర్బన్‌లో సాధారణ మధ్యతరగతి తమిళ కుటుంబంలో జన్మించిన నవీ పిళ్లై, వర్ణవివక్షకు వ్యతిరేకంగా మరియు అణగారిన వర్గాల హక్కుల కోసం తన వృత్తిపరమైన పోరాటాన్ని ప్రారంభించారు. దక్షిణాఫ్రికా హైకోర్టులో నియమితులైన తొలి శ్వేతజాతి యేతర మహిళా జడ్జిగా రికార్డు



సృష్టించిన ఆమె, యుగోస్లేవియా అంతర్జాతీయ క్రిమినల్ ట్రిబ్యునల్ జడ్జిగా మరియు రువాండా నరమేధ ట్రిబ్యునల్ అధ్యక్షురాలిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం 2008 నుంచి 2014 వరకు ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల హైకమిషనర్‌గా సేవలు అందిస్తూ అంతర్జాతీయ స్థాయిలో మహిళల హక్కులు, శరణార్థుల రక్షణ, మరియు శృంగార ధోరణి ప్రాతిపదికన జరిగే వివక్షకు వ్యతిరేకంగా బలమైన గొంతుకగా నిలిచారు. గతంలో ప్రపంచవ్యాప్తంగా లభించిన అనేక పురస్కారాలతో పాటు 2024లో ప్రతిష్టాత్మక 'సిడ్నీ శాంతి బహుమతి' పొందిన నవీ పిళ్లైని, ఇప్పుడు ప్రపంచంలోనే అత్యున్నతమైన నోబెల్ శాంతి పురస్కారం వరించడం పట్ల అంతర్జాతీయ న్యాయకోవిదులు, మానవ హక్కుల సంరక్షకులు మరియు భారతీయ శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ పురస్కారాన్ని డిసెంబర్ 10న ఓస్లోలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో నార్వే నోబెల్ కమిటీ అధికారికంగా ప్రదానం చేయనుంది.

## ఈగను చంపడానికి సుత్తిని వాడలేరు

**సీజేపీ నిరసనపై కేంద్రం ఆంక్షలపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 9 (చురకలు):** 'కాక్రోచ్ జనతా పార్టీ' శనివారం (అక్టోబర్ 10) చేపట్టిన ధర్నాను అడ్డుకునేందుకు కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ పోలీసులు విధించిన కఠిన ఆంక్షలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. నిరసనలను నియంత్రించే నెపంతో సామాన్య పౌరుల రాకపోకలపై పూర్తి నిషేధం విధించడం, రవాణా వ్యవస్థను స్తంభింపజేయడం రాజ్యాంగబద్ధం కాదని స్పష్టం చేసింది. "ఈగను చంపడానికి సుత్తిని ఉపయోగించలేరు" అంటూ ప్రభుత్వం అనుసరించిన అతి కఠిన విధానాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఘాటుగా తప్పుపట్టింది. ఓటర్ల హక్కుల పరిరక్షణ నిరసన నేపథ్యంలో ఢిల్లీ వ్యాప్తంగా మెట్రో గేట్లు మూసివేయడం, రైలు సర్వీసులను నిలిపివేయడం, వాహనాల రాకపోకలను అడ్డుకోవడంపై దాఖలైన పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు.. ప్రజా రవాణాను స్తంభింపజేసే చర్యలను తక్షణమే పునఃపరిశీలించాలని కేంద్ర ప్రభుత్వ న్యాయవాది (సొలిసిటర్ జనరల్) తుషార్ మెహతాను ఆదేశించింది. న్యాయస్థానం అభిప్రాయానికి స్పందించిన సొలిసిటర్ జనరల్, ప్రభుత్వ ఉన్నతాధికారులతో చర్చించి ఆంక్షల తీవ్రతను తగ్గిస్తామని మరియు ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. చట్టాన్ని అమలు చేసే అధికారం ప్రభుత్వానికి ఉన్నప్పటికీ, నియంత్రణ చర్యలు అవసరమైన పరిమితికి లోబడే ('ప్రపోర్షనాలిటీ' సూత్రం ప్రకారం) ఉండాలని, భద్రత పేరుతో పౌరులను బంధించడం అంగీకార్యం కాదని అత్యున్నత న్యాయస్థానం పునరుద్ఘాటించింది.



## ఎన్నికల్లో అక్రమాలు జరిగాయి

**రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు 'ఇండియా' కూటమి ఫిర్యాదు!**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 9 (చురకలు):** దేశంలో ఎన్నికల వ్యవస్థను, రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ 'ఇండియా' కూటమి ఎంపీలు శుక్రవారం భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ రాశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాల నేతృత్వంలో దేశవ్యాప్తంగా భారీ స్థాయిలో 'ఓట్ల చోరీ' జరిగిందని, హర్యానా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, బీహార్, ఢిల్లీ మరియు పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల ఎన్నికల్లో తీవ్ర అక్రమాలు చోటుచేసుకున్నాయని ప్రతిపక్ష నాయకులు ఆరోపించారు. భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అనుకూలంగా ఈవీఎంలు, ఓటర్ల జాబితాలను తారుమారు చేశారని, 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' ప్రక్రియ ద్వారా తొలగించిన 13.30 కోట్ల మంది అర్హులైన ఓటర్ల పేర్లను తక్షణమే జాబితాలో పునరుద్ధరించాలని ఎంపీలు విజ్ఞప్తి చేశారు. ఈ అక్రమాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని, ఈసీ అధికారులకు జీవితకాల రక్షణ కల్పించే 2023 చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 'సర్' ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని లేఖలో స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యానికి పునాది అయిన ఓటు హక్కు పరిరక్షణ కోసం రాష్ట్రపతి తక్షణమే జోక్యం చేసుకోవాలని కూటమి నాయకులు కోరారు. దేశవ్యాప్తంగా నిర్వహించే అన్ని ఎన్నికల్లో పాత పద్ధతిలోనే పేపర్ బ్యాలెట్ విధానాన్ని పునఃప్రారంభించాలని, ఓట్ల చోరీకి సంబంధించి స్పష్టమైన ఆధారాలు లభించినందున గత రెండేళ్లలో జరిగిన అన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను రద్దు చేసి, తిరిగి పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని వారు రాష్ట్రపతిని కోరారు.

# అంబిటస్ పాఠశాలలో ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబరాలు



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 09, :**
దసరా సెలవులు శనివారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో సిద్దిపేట పట్టణంలోని అంబిటస్ పాఠశాలలో శుక్రవారం ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంప్రదాయ దుస్తుల్లో ముస్తాబైన చిన్నారులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. చిన్నారుల సందడి, అందంగా అలంకరించిన బతుకమ్మలతో పాఠశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా వేడుకలు ఆనందోత్సాహాల మధ్య సాగాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎడ్ల జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పిఎంసి ఆదర్శ పాఠశాలలో ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబరాలు







**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 09, :**
ఇబ్రహీంనగర్‌లోని పిఎంసి ఆదర్శ పాఠశాల, కళాశాలలో శుక్రవారం ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి, ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్ కుమార్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ



**దుబ్బాక ప్రతినిధి (తొగుట), అక్టోబర్ 09, :**
తొగుట మండలములోని మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ స్కూల్ లింగాపూర్ లో శుక్రవారం విద్యార్థులకు ప్రింటెడ్ నోట్ బుక్స్ ను పంపిణీ చేశారు. గాంధారి యాదవ రెడ్డి తల్లి గాంధారి లక్ష్మీ పాఠశాల విద్యార్థులకు ప్రింటెడ్ నోట్ బుక్స్ ను అందించారు. ఈ సందర్భంగా గాంధారి లక్ష్మీ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు చేతి వ్రాత కూడా బాగుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ సురేష్ కుమార్, ఉపాధ్యాయులు సాయి నిఖిత, చైర్మన్ డి జ్యోతి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# బతుకమ్మ సంబరాలు జరుపుకున్న అంగన్వాడి పిల్లలు

## పాల్గొన్న గ్రామ సర్పంచ్ గుండెల వజ్రవ్వ



**దుబ్బాక ప్రతినిధి, అక్టోబర్ 09, :**
సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం పెద్ద గుండవెల్లి గ్రామంలోని అంగన్వాడి సెంటర్ 2 లో శుక్రవారం బతుకమ్మ సంబరాలను పిల్లలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వజ్రవ్వ మాట్లాడుతూ సంస్కృతి సాంప్రదాయాలు చిన్నతనంలోనే పిల్లలకు నేర్పించినట్లయితే భవిష్యత్తులో ఆచార కట్టుబాట్లకు అలవాటు పడుతూ ముందుకు వెళ్తారని, కాసేపు అంగన్వాడి పిల్లలతో సరదాగా ఆటపాటలతో బతుకమ్మ ఆడుతూ సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ కవిత, ఆయమ్మ పద్మ, మనెవ్వ తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి దేవత బతుకమ్మ.. ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీక..

- బతుకమ్మ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 09, :**
తెలంగాణ సంస్కృతి, సంప్రదా యాలకు, ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతిపై ప్రేమకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను ప్రజలం దరూ సంతోషంగా జరుపుకోవాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆకాంక్షించారు. రేపటి నుంచి ప్రారంభం కానున్న బతుకమ్మ పండుగ సందర్భంగా శుక్రవారం ఆయన జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమై సద్దుల బతుకమ్మ వరకు తొమ్మిది రోజులపాటు ఆడపడుచు లందరూ తీరొక్క పూలతో, రంగురంగుల బతుకమ్మలను పేర్చి, పిల్లాపాపలతో కలిసి ఆనందంగా పండుగ జరుపుకోవాలని కోరారు. పూలను ప్రకృతి దేవతగా భావించి పూజించే గొప్ప సంప్రదాయం తెలంగాణలో ఉందని, బతుకమ్మ పండుగ మహిళల ఆత్మగౌరవానికి, ప్రకృతి ప్రేమకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో బతుకమ్మ పండుగను అధికారికంగా నిర్వహించడంతోపాటు రాష్ట్ర పండుగగా గుర్తించారని తెలిపారు. ప్రతి ఏటా బతుకమ్మ కానుకగా ఆడపడుచులకు చీరలు పంపిణీ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే ఈ పండుగను ప్రతి ఒక్కరూ కలిసిమెలిసి, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

**సిద్దిపేటలో ఘనంగా బతుకమ్మ వేడుకలు**

సిద్దిపేట జిల్లా ఏర్పాటై పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా జిల్లా ప్రజలకు హరీశ్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా దశాబ్ది వేడుకల్లో భాగంగా సిద్దిపేటలోని కోమటి చెరువు వద్ద ఆహారోత్సవం, లేజర్ ప్రదర్శనల నడుమ బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలని సూచించారు. ఈ వేడుకల్లో జిల్లా ప్రజలందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 09, :**
సిద్దిపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు రసాయనాలు లేని సహజసిద్ధమైన రంగురంగుల పూలతో బతుకమ్మలను తయారు చేసి, పాటలు పాడుతూ నృత్యాలు చేస్తూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ రకాల తినుబండారాలను ఒకరికొకరు పంచుకుంటూ సంప్రదాయబద్ధంగా పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రధానాచార్యులు ప్రొఫెసర్ జి జీవన్ కుమార్ మాట్లాడుతూ సహజసిద్ధమైన పూలతో బతుకమ్మలను తయారు చేయడం ద్వారా పర్యావరణహితంగా పండుగలను జరుపుకోవాలనే సందేశాన్ని విద్యార్థినులు సమాజానికి అందించారని ప్రశంసించారు. కళాశాల వాణిజ్యశాస్త్ర విద్యార్థినులు బ్యాంకింగ్, బీమా, వ్యాపార రంగాల ప్రాధాన్యాన్ని తెలియజేసేలా ప్రత్యేక బతుకమ్మను రూపొందించారు. అలాగే సిద్దిపేట జిల్లా ఏర్పడి పదేళ్లు పూర్తయిన సందర్భంగా విద్యార్థినులు పది ఆకారంలో ఏర్పడి నృత్యాలు చేయడం వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో కళాశాల ఉప ప్రధానాచార్యులు డాక్టర్ శ్వేత, అధ్యాపకులు డాక్టర్



స్రవంతి, డాక్టర్ సువర్ణాదేవి, డాక్టర్ స్వప్న, ఇందిర, కల్పన, షాజహాన్ బేగం తదితర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని విద్యార్థినులతో కలిసి బతుకమ్మ సంబరాల్లో సందడి చేశారు.

# దాండియా వేడుకలు ప్రశాంతంగా నిర్వహించాలి

- నిర్వాహకులు ముందస్తు పోలీసు అనుమతి తీసుకోవాలి
- పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 09, :**
దాండియా వేడుకలను ప్రశాంతంగా, సురక్షిత వాతావరణంలో నిర్వహించాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ నిర్వాహకులకు సూచించారు. శుక్రవారం సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో దాండియా కార్యక్రమాల నిర్వాహకులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించి, పలు సూచనలు చేశారు. వేడుకల నిర్వహణకు నిర్వాహకులు తప్పనిసరిగా ముందస్తు పోలీసు అనుమతి తీసుకోవాలని, అనుమతించిన సమయపాలనను కచ్చితంగా పాటించాలని సూచించారు. కార్యక్రమానికి వచ్చే ప్రజల రద్దీని నియంత్రించేందుకు ముందస్తు ప్రణాళిక రూపొందించు కోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా వేడుకలను ప్రశాంతంగా ముగించాలని స్పష్టం చేశారు. సామాజిక విద్రోహ శక్తులు, అల్లరి మూకలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించకూడదన్నారు. ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని, విద్యుత్ అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ విద్యుత్ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అగ్నిప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమ ప్రాంగణంలోకి వచ్చే, బయటకు వెళ్లే మార్గాల్లో రద్దీ ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రవేశ ద్వారాలు, నిష్క్రమణ మార్గాలు, వాహనాల నిలిపే ప్రాంతాల్లో రవాణా ఇబ్బందులు తలెత్తకుండా స్వచ్ఛంద సేవకులతో తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. స్వచ్ఛంద సేవకులు ప్రత్యేక దుస్తులు లేదా గుర్తింపు కార్డులు ధరించి సులభంగా గుర్తించేలా ఉండాలని, వేడుకలకు వచ్చే ప్రజలతో మర్యాదగా వ్యవహరిస్తూ వారికి సహకరించాలని సూచించారు. కార్యక్రమం పూర్తయ్యే వరకు నిర్వాహకులు ప్రాంగణంలోనే అందుబాటులో ఉండాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేందుకు అవసరమైన ఫోన్ నంబర్లను అందుబాటులో ఉంచుకోవాలని, కార్యక్రమం ప్రారంభానికి ముందే స్వచ్ఛంద సేవకులకు తగిన అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సమాజ శ్రేయస్సు, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని దాండియా వేడుకల నిర్వాహకులు, ప్రజలు పోలీసు శాఖకు పూర్తి సహకారం అందించాలని పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ కోరారు.

# సమాచార హక్కు దరఖాస్తులకు గడువులోగా సమాధానాలు ఇవ్వాలి

- అధికారులకు అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్ సూచన

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 09, :**
సమాచార హక్కు చట్టం–2005 ద్వారా అర్జీదారులు కోరిన సమాచారాన్ని నిర్ణీత గడువులోగా అందించాలని అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్ అధికారులకు సూచించారు. శుక్రవారం సిద్దిపేట సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన సమాచార హక్కు చట్టం వారోత్సవాలు–2026 కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని తెరపై ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ప్రధాన న్యాయమూర్తి, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.అనంతరం లక్ష్మీ కిరణ్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ద్వారా పౌరులకు కల్పించిన హక్కులపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ చట్టం అమలులో ప్రతి అధికారి బాధ్యతా యుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజా సమాచార అధికారులు పారదర్శకత, జవాబుదారీతనంతో విధులు నిర్వహిస్తూ, అర్జీదారులు కోరిన సమాచారాన్ని చట్టంలో నిర్దేశించిన గడువులోగా అందించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ, కలెక్టరేట్ పరిపాలనాధికారి రాజకుమార్, వివిధ







శాఖలకు చెందిన ప్రజా సమాచార అధికారులు పాల్గొన్నారు.

# ఆర్టిఐ దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలి

- చట్టంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి
- అధికారులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలి
- దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే తీవ్రంగా పరిగణిస్తాం
- ఆర్టీఐ వారోత్సవాల సందర్భంగా అధికారులకు అవగాహన కార్యక్రమం



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 09, :**
సమాచార హక్కు చట్టం–2005 కింద అందిన దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని ఉన్నతాధికారులు అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సమాచార హక్కు చట్టంపై పౌర సమాచార అధికారులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు. అక్టోబర్ 5 నుంచి 12వ తేదీ వరకు సమాచార హక్కు వారోత్సవాలు–2026 నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రజలకు సమాచార హక్కు చట్టంపై విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లా, రెవెన్యూ డివిజన్, మండల స్థాయిల్లో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సమాచార హక్కు చట్టం కింద పౌర సమాచార అధికారులు, సహాయ పౌర సమాచార అధికారులు, మొదటి అప్పీళ్ల అధికారులు తమకు నిర్దేశించిన బాధ్యతలను పూర్తిస్థాయిలో తెలుసుకొని విధులు నిర్వహించాలని ఆదేశించారు. చట్టం ప్రకారం ప్రజలకు అందించాల్సిన సమాచారాన్ని పారదర్శకంగా అందుబాటులో ఉంచాలని తెలిపారు. సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 4(1)(బి) ప్రకారం ప్రభుత్వ శాఖలు స్వచ్ఛందంగా వెల్లడించాల్సిన సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. దీనివల్ల ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకత పెరుగుతుందని తెలిపారు. అధికారుల పరిధిలో పెండింగ్‌లో ఉన్న సమాచార హక్కు దరఖాస్తులన్నింటినీ త్వరితగతిన పరిష్కరించాలని స్పష్టం చేశారు. దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించినా, ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించకపోయినా తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె. వై ప్రసాద్, కలెక్టరేట్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ కిషన్, సూపరింటెండెంట్ జ్యోతి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేట-సిరిసిల్ల రైల్వే లైన్ పనులు వేగవంతం చేయాలి

- పెండింగ్ సమస్యలను పరిష్కరించి, రైతులు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్ కట్టా హైమావతి

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 09, :**
సిద్దిపేట నుంచి సిరిసిల్ల వరకు చేపడుతున్న రైల్వే లైన్ నిర్మాణ పనులను వేగవంతం చేసేలా పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సిద్దిపేట సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో దక్షిణ మధ్య రైల్వే ఉప ముఖ్య ఇంజనీర్ ఎన్ నవ్యశ్రీతో కలిసి రైల్వే, రెవెన్యూ, రహదారులు– భవనాలు, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నకోడూరు, నారాయణరావు పేట మండలాల్లో రైల్వే లైన్ నిర్మాణానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న సమస్యలు, వంతెనల నిర్మాణ ప్రాంతాల్లో భూసేకరణ వివరాలను రైల్వే అధికారులు కలెక్టర్‌కు వివరించారు. చిన్నకోడూరు, మాచాపూర్, గంగాపూర్, విఠలాపూర్‌తో పాటు నారాయణరావుపేట మండలంలోని గుర్రాలగొంది, జక్కాపూర్ గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై కలెక్టర్ అధికారులతో చర్చించారు. పెండింగ్ సమస్యలను రైల్వే, రెవెన్యూ, రహదారులు– భవనాలు, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని సూచించారు. వంతెనల నిర్మాణం చేపట్టే ప్రాంతాల్లో వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయంగా తారు రహదారులను ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.



భూసేకరణకు సంబంధించిన పెండింగ్ వివరాలను క్షేత్రస్థాయిలో సంయుక్తంగా పరిశీలించి, సమగ్ర నివేదిక అందించాలని స్పష్టం చేశారు. రైల్వే నిర్మాణ పనుల వల్ల సమీప రైతులు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, వంతెనల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని రైల్వే అధికారులకు సూచించారు. పనులు పూర్తయ్యే వరకు సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ సదానందం, రైల్వే కార్యనిర్వాహక ఇంజనీర్ మూర్తి, రహదారులు– భవనాలు, పంచాయతీరాజ్ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# రామంచ పాఠశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

- పూల పండుగ విశిష్టతను చాటుతూ విద్యార్థుల ఆటపాటలు

**చిన్నకోడూరు, అక్టోబర్ 09, :**
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని రామంచ ప్రాథమిక పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు.శుక్రవారం పాఠశాల ఆవరణలో వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, పండుగ విశిష్టత, ఆవశ్యకతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు, గ్రామస్తులతో కలిసి ఉపాధ్యాయులు బతుకమ్మ పాటలు పాడుతూ సంప్రదాయ ఆటలు ఆడారు. చిన్నారులు బతుకమ్మ చుట్టూ తిరుగుతూ చప్పట్లు కొడుతూ ఉత్సాహంగా సంబరాల్లో పాల్గొన్నారు. బాలురు సైతం నృత్యాలతో అలరించి అందరినీ ఆకట్టుకున్నారు. విద్యార్థుల్లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై.వి. సురేష్ కుమార్, ఉపాధ్యాయులు సునీత, ఆబేద బేగం, నాగమణి, వరప్రసాద్, యాదయ్య, స్వరూప, సిబ్బంది పోచవ్వ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.





# సిద్దిపేట గ్రంథాలయం ప్రతి నిరుద్యోగికి గురువు కావాలి

- పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలన్నీ అందుబాటులో ఉంచాలి
- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 09, :**
సిద్దిపేట జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయాన్ని నిరుద్యోగ యువతకు మార్గదర్శకంగా తీర్చిదిద్దాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం అన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అవసరమైన అన్ని పుస్తకాలను అందుబాటులో ఉంచాలని గ్రంథాలయ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా గ్రంథాలయ భవనం పైకప్పు మరమ్మతులపై సంబంధిత సహాయ ఇంజినీర్, సిబ్బందితో చర్చించినట్లు తెలిపారు. అలాగే గజ్వేల్, దుబ్బాక, దౌల్తాబాద్ ప్రాంతాల్లో నూతన గ్రంథాలయ భవనాల ఏర్పాటుపై చర్చించినట్లు పేర్కొన్నారు. వర్గల్, బెజ్జంకి తదితర ప్రాంతాల్లోని గ్రంథాలయ భవనాలకు అవసరమైన మరమ్మతులు చేపట్టడంతో పాటు, పాఠకులకు అనుకూలంగా అవసరమైన ఫర్నిచర్ సమకూర్చే అంశాలపై కూడా సమీక్షించారు. గ్రంథాలయాలకు వచ్చే పాఠకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, ముఖ్యంగా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగ యువతకు అవసరమైన పుస్తకాలు, అధ్యయన వాతావరణం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో గ్రంథాలయ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



# శ్రీవాణి పాఠశాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

- ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు, చైర్మన్ మంజుల రాజనర్సు, న్యాయవాది యాసాల వెంకట్ లింగం

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 09, :**
సిద్దిపేట పట్టణంలోని భారత్ నగర్‌లో ఉన్న శ్రీవాణి పాఠశాలలో శుక్రవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తన్నీరు హరీశ్ రావు, చైర్మన్ మంజుల రాజనర్సు, న్యాయవాది యాసాల వెంకట్ లింగం హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయినులు సంప్రదాయ దుస్తులు ధరించి, వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చారు. బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలతో ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. దీంతో పాఠశాల ప్రాంగణమంతా పండుగ సందడితో నిండిపోయింది. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ సిహెచ్ సత్యం మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. ప్రకృతిని ఆరాధిస్తూ, పూలను పూజించే ఈ పండుగ మహిళల ఐక్యతకు, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. విద్యార్థులకు మన సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని తెలియజేయడమే ఇలాంటి వేడుకల ముఖ్య ఉద్దేశమని అన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయినులు కలిసి ఉత్సాహంగా పాల్గొనడంతో పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది. పాఠశాలలో చివరి రోజు వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ముగిశాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



# 101 బతుకమ్మలతో సరస్వతి గ్లోబల్ స్కూల్‌లో ఘనంగా వేడుకలు

- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టిన విద్యార్థినుల బతుకమ్మలు
- పాఠశాలలో బతుకమ్మ వేడుకలతో ఆధ్యాత్మిక శోభ

**దుబ్బాక ప్రతినిధి, అక్టోబర్ 09, :**
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను దుబ్బాక సరస్వతి గ్లోబల్ స్కూల్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో 101 బతుకమ్మలను పేర్చి విద్యార్థినులు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొనడంతో సందడి నెలకొంది. సంప్రదాయ పూలతో తీర్చిదిద్దిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాఠశాలలోని ప్రతి తరగతికి చెందిన విద్యార్థినులు గునుగు, తంగేడు, బంతి తదితర రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించారు. తులసి బతుకమ్మ, దుర్గామాత బతుకమ్మతో పాటు వినూత్న రీతిలో రూపొందించిన బతుకమ్మలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో పాల్గొని పండుగ శోభను మరింత పెంచారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు సైతం విద్యార్థులతో కలిసి బతుకమ్మ ఆడుతూ ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించడంతో పాటు పండుగల విశిష్టతను తెలియజేయడమే ఇలాంటి కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రతి సంవత్సరం వివిధ పండుగలను ప్రత్యేకంగా నిర్వహిస్తూ విద్యార్థులకు మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. అందంగా బతుకమ్మలను పేర్చి ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపల్ బాబా, కరస్పాండెంట్ కనకరెడ్డి, యాదగిరి, అనిల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# సహస్ర ఉన్నత పాఠశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 09, :**
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను సిద్దిపేటలోని సహస్ర ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల పూలను సేకరించి పాఠశాలకు తీసుకువచ్చారు. ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో రంగురంగుల పూలతో అందమైన బతుకమ్మలను పేర్చారు. అనంతరం పాఠశాల ఆటస్థలంలో బతుకమ్మలను ఉంచి వేడుకలను ప్రారంభించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మల చుట్టూ తిరుగుతూ చప్పట్లతో పాటలు పాడుతూ ఉత్సాహంగా ఆడిపాడారు. బతుకమ్మ పాటలు, సంగీతంతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం, పాఠశాల కరస్పాండెంట్ శ్రవణ్, డైరెక్టర్ హారిక, ప్రిన్సిపాల్ రాఘవేందర్ పాల్గొన్నారు. వేడుకల అనంతరం విద్యార్థులు, పాఠశాల సిబ్బంది బతుకమ్మలను సమీపంలోని నీటికుంటలో నిమజ్జనం చేశారు. ఇలాంటి కార్యక్రమాల నిర్వహణతో విద్యార్థులకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెరగడంతో పాటు వారిలో స్నేహభావం, ఐక్యత పెంపొందుతాయని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.

# శ్రీ సాయి విద్యానికేతన్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు



**దుబ్బాక ప్రతినిధి, అక్టోబర్ 09, :**
గంభీర్పూర్ గ్రామంలోని శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాలలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి, బతుకమ్మ పాటలు పాడుతూ, దాండియా ఆటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షరీఫ్ మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని తెలిపారు. ప్రకృతిని ఆరాధిస్తూ వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి మహిళలు, ఆడపడుచులు భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఈ పండుగ తెలంగాణ ప్రత్యేకతను చాటిచెబుతుందని పేర్కొన్నారు. విద్యార్థులకు మన సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని తెలియజేయడమే ఇలాంటి కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమని వివరించారు. ఈ వేడుకల్లో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పాఠశాల ఆవరణలో పండుగ సందడి నెలకొనగా, విద్యార్థుల ఉత్సాహం అందరినీ ఆకట్టుకుంది.

# మాచిరెడ్డిపల్లిలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

## సంప్రదాయాలకు ప్రతీకగా పూల పండుగ

## ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు, మహిళలు



**సదాశివపేట, అక్టోబర్ 09, :**
తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మాచిరెడ్డిపల్లి గ్రామంలోని పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మోహన్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామ మహిళలు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ పండుగ సంబరాలను జరుపుకున్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతను ఈ సందర్భంగా చాటిచెప్పారు. పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొనగా, విద్యార్థులు, మహిళలు ఆనందోత్సాహాల మధ్య వేడుకల్లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, కమిటీ చైర్మన్, అంగన్‌వాడీ టీచర్, పూర్వ విద్యార్థులు, యువకులు, గ్రామ మహిళలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చురకలు
శనివారం 10.10.2026

# పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు సుంకరి కృష్ణను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

**టేక్మాల్, అక్టోబర్ 09, :**
పరిధిలోని బొడ్మట్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులుగా సేవలందిస్తున్న సుంకరి కృష్ణ ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల ఎన్నికల్లో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఉపాధ్యాయులు కృష్ణను బొడ్మట్ పల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు శుక్రవారం శాలువాతో సన్మానించి మెమొంటోను అందజేసి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అల్లాదుర్గం రిటైర్డ్ ఎంఈఓ కలాలి ధనుంజయ గౌడ్, వార్డు సభ్యులు కంకర భూషణం, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కొటంగారి శంకరయ్య, మహమ్మద్ హమీద్, పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు లత, ఉపాధ్యాయులు స్వప్న, అశోక్, మహమ్మద్ పాషా, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.



# చెత్త వేరు చేయకపోవడంపై మున్సిపల్ కమిషనర్ ఆగ్రహం

- తడి, పొడి, హానికరమైన చెత్తను వేర్వేరుగా సేకరించాలి
- నిర్లక్ష్యం పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చరిక

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 09, :**
సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చెత్త పేరుకుపోవడంపై మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యం వందలాది మంది రోగులు, వారి కుటుంబ సభ్యులు, ప్రజలు వచ్చే ఆసుపత్రిలో చెత్తను సక్రమంగా వేరు చేయకుండా నిల్వ చేయడం వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారడమే కాకుండా, వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. శుక్రవారం కమిషనర్ మాట్లాడుతూ ఆసుపత్రిలో ఉత్పత్తి అయ్యే చెత్తను తడి, పొడి, హానికరమైన చెత్తగా మూడు రకాలుగా



వేరు చేయడం తప్పనిసరి అని స్పష్టం చేశారు. వేరు చేసిన చెత్తను సంబంధిత మున్సిపల్ వాహనాలకు అందించాలని, ఆసుపత్రి పరిసరాల్లో చెత్త పేరుకుపోకుండా నిరంతరం పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజారోగ్యానికి సంబంధించిన అంశాల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, చెత్త నిర్వహణలో ఇలాంటి పరిస్థితులు మళ్లీ పునరావృతమైతే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు చెత్త సేకరణ, వేరు చేయడం, తరలింపు ప్రక్రియలను నిరంతరం పర్యవేక్షించాలని పారిశుద్ధ్య అధికారులకు సూచించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో చెత్త పేరుకుపోవడానికి గల కారణాలపై వైద్య కళాశాల పర్యవేక్షకురాలు డాక్టర్ సంగీత, జిల్లా వైద్యాధికారి డాక్టర్ ధనరాజు, ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ శ్రావణి తదితర అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రిలో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, సంబంధిత విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇకపై ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఆసుపత్రికి వచ్చే రోగులకు, ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్య తనిఖీ అధికారులు మహేష్, శివకుమార్, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో "బతుకమ్మ కార్యక్రమం"

**చొప్పదండి/కొడిమ్యాల, అక్టోబర్ 09,':**
జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బతుకమ్మ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ పి. గోపాల్ మాట్లాడుతూ తెలంగాణలో బతుకమ్మ పండుగకు ప్రత్యేకత ఉంటుందని, తొమ్మిది రోజులు బతుకమ్మ కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ ఎక్కువ సంఖ్యలో పాల్గొని బతుకమ్మ పాటలతో, ఆటలతో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి. భాస్కర్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# తెలంగాణ చరిత్రను యువత తెలుసుకోవాలి

- సిద్దిపేట జిల్లా, రైల్వే మార్గం, గోదావరి జలాల కలలను కేసీఆర్ పాలనలోనే సాకారం చేసుకున్నాం
- వరి ధాన్యం ఉత్పత్తి, వైద్య విద్యలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచింది
- మాజీ మంత్రి హరీశ్ రావు

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 09, :**
విద్యార్థులు, యువత తెలంగాణ చరిత్రను తప్పక తెలుసుకోవాలని, అప్పుడే గతంలో జరిగిన పోరాటాలు, అమరవీరుల త్యాగాల విలువ అర్థమవుతుందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా శుక్రవారం నిర్వహించిన యువజన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. 1956లో తెలంగాణను ఆంధ్ర ప్రాంతంలో విలీనం చేసినప్పటి నుంచి నిధులు, నీళ్లు, ఉద్యోగాల విషయంలో వివక్ష కొనసాగిందని హరీశ్ రావు పేర్కొన్నారు. 1969 తెలంగాణ ఉద్యమంలో 396 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. ప్రొఫెసర్ జయశంకర్ వంటి నాయకులు తెలంగాణ ఆకాంక్షను సజీవంగా ఉంచారని తెలిపారు. 2001లో కేసీఆర్ పదవులను త్యజించి తెలంగాణ ఉద్యమాన్ని ప్రారంభించారని, ఆమరణ నిరాహార దీక్షతో పోరాడి 2014 జూన్ 2న ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారని అన్నారు. పదవుల కంటే తెలంగాణే ముఖ్యమని చాటిన నాయకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు.

### తెలంగాణలో గణనీయమైన అభివృద్ధి

కేసీఆర్ పదేళ్ల పాలనలో సాగునీరు, తాగునీరు, విద్యుత్ రంగాల్లో గణనీయమైన మార్పులు వచ్చాయని హరీశ్ రావు అన్నారు. ఒకప్పుడు కరువు, వలసలతో ఇబ్బందులు ఎదుర్కొన్న తెలంగాణ, వరి ధాన్యం ఉత్పత్తిలో పంజాబ్‌ను అధిగమించి దేశంలోనే అగ్రస్థానానికి చేరిందని పేర్కొన్నారు. రాష్ట్రం ఏర్పడినప్పుడు ఐదు ప్రభుత్వ వైద్య కళాశాలలు, 2,780 ఎంబీబీఎస్ సీట్లు మాత్రమే ఉండేవని, ప్రస్తుతం 33 వైద్య కళాశాలలు, 10 వేల వైద్య విద్య సీట్లు అందుబాటులోకి వచ్చాయని వివరించారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, రైతుబంధు వంటి పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని అన్నారు.

### సిద్దిపేట జిల్లా కల సాకారం

సిద్దిపేట జిల్లా ఏర్పాటు కోసం 1983లో కేసీఆర్ అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావుకు వినతిపత్రం అందజేశారని హరీశ్ రావు గుర్తుచేశారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత 2016 అక్టోబర్ 11న సిద్దిపేట జిల్లాను ఏర్పాటు చేశారని తెలిపారు. దీంతో పాలన ప్రజలకు చేరువైందన్నారు. గతంలో ఎన్నికల



సమయంలో మాత్రమే ప్రస్తావనకు వచ్చిన సిద్దిపేట జిల్లా, రైల్వే మార్గం, గోదావరి జలాల కలలు ప్రత్యేక రాష్ట్రంలో సాకారమయ్యాయని పేర్కొన్నారు. అనంతగిరి, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టుల ద్వారా జిల్లాకు సాగునీరు అందుతోందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మల్లన్న సాగర్ నుంచి నీటిని తరలించడంతో కోమటి చెరువుకు కూడా నీరు చేరుతోందని చెప్పారు. తోర్నాలలో మొక్కజొన్న, పొద్దుతిరుగుడు పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, భవిష్యత్తులో కృషి విజ్ఞాన కేంద్రాన్ని కూడా సాధించేందుకు కృషి చేస్తామని తెలిపారు. రైతులకు అధిక ఆదాయం అందించే లక్ష్యంతో చేపట్టిన ఆయిల్ పామ్ సాగు విస్తరణలో సిద్దిపేట జిల్లా ముందంజలో ఉందని హరీశ్ రావు పేర్కొన్నారు. తెలంగాణ సాధన కోసం జరిగిన పోరాటాలు, స్వరాష్ట్రంలో సాధించిన అభివృద్ధిని యువత తెలుసుకుని భవిష్యత్తు నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

# విజ్ డమ్ విద్యా భారతి పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలు



**చొప్పదండి/కొడిమ్యాల, అక్టోబర్ 09, :**
జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రంలోని విజ్ డమ్ విద్యా భారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శుక్రవారం ముందస్తు బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. తెలంగాణలో అతిపెద్ద పండగ ప్రకృతిలో లభించే పూలను పూజించే ప్రత్యేకమైన బతుకమ్మ పండుగ సందర్భంగా విజ్ డమ్ విద్యా భారతి పాఠశాల విద్యార్థులు తంగేడు, గునుగు పువ్వులు, బంతిపూలతో అందంగా బతుకమ్మను పేర్చి, బతుకమ్మను పూజిస్తూ, కోలాటాలతో బతుకమ్మ పాటలతో ఆడుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సహకారంతోనే నేరాల నివారణ సాధ్యం

- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్
- దసరాకు ఊర్లకు వెళ్లే వారు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి
- అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వండి

**జగిత్యాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 09, :**
దసరా పండుగ సందర్భంగా చాలామంది తమ స్వగ్రామాలకు, ఇతర ప్రాంతాలకు ప్రయాణాలు చేస్తుంటారని, ఇదే అదనుగా భావించి దొంగలు ఇళ్లలో చోరీలకు పాల్పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. పండుగకు ఊళ్లకు వెళ్లే వారు తమ ఇళ్ల



భద్రత విషయంలో ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. జిల్లా పరిధిలో చోరీల నియంత్రణకు పోలీసు శాఖ తరఫున అన్ని అవసరమైన చర్యలు చేపడుతున్నామని, రాత్రి వేళల్లో పోలీసు గస్తీని ముమ్మరం చేసినట్లు ఎస్పీ తెలిపారు. ప్రజల్లో అవగాహన కల్పిస్తూ అప్రమత్తం చేస్తున్నామని పేర్కొన్నారు. ఇంటికి తాళం వేసిన తర్వాత తాళం బయటకు కనిపించకుండా పరదా కప్పి ఉంచాలని, మెయిన్ డోర్ లోపల నుంచి లాక్ చేసి పక్క డోర్లకు తాళం వేయడం మంచిదని తెలిపారు. ఊరు వెళ్లేముందు ఇంట్లో బంగారు, వెండి, డబ్బు వంటి విలువైన వస్తువులను బీరువాలో పెట్టకూడదని, బ్యాంక్ లాకర్లలో దాచుకోవడం మంచిదని సూచించారు. విలువైన వస్తువులు, వ్యక్తిగత ఆర్థిక విషయాల సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని, బీరువా తాళాలు ఇంట్లో కప్ బోర్డులు లేదా ఇతర ప్రదేశాలలో ఉంచకూడదని అన్నారు. ఊరు వెళితే ఇంటి పక్కనవారికి, సంబంధిత పోలీసులకు సమాచారం అందించడం ద్వారా రాత్రి సమయాల్లో గస్తీ తిరగడానికి వచ్చినప్పుడు ఇంటి పై ప్రత్యేక శ్రద్ధ వహిస్తారు. రాత్రి సమయంలో ఏదైనా ఒక రూమ్ లో లైట్ వెలుగుతూనే ఉండేలా ఆన్ చేసి ఉంచాలి. మీ మొబైల్ కి నోటిఫికేషన్ వచ్చేలా ఇంటికి సీసీ కెమెరా అమర్చుకోవాలి. ఇంటి బయట నాలుగు దిక్కులు కవర్ అయ్యేలా కెమెరాలు అమార్చుకోవాలని, చుట్టుప్రక్కల వారిని తమ ఇంటిని కనిపెట్టి ఉండమని చెప్పి వెళ్లడం, ఇంటికి సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని తెలిపారు. ఇంట్లో ఎవరైనా మహిళలు, వృద్ధులు వద్దకు అపరిచితులు సమాచారం కావాలంటూ వస్తే నమ్మవద్దని చెప్పాలని అన్నారు. తమ పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు సంచరించినా, అనుమానాస్పద కార్యకలాపాలు కనిపించినా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 112 కు సమాచారం అందించాలని కోరారు.

# తులిప్స్ స్కూల్లో ముందస్తు "బతుకమ్మ" వేడుకలు

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 09, :**
బతుకమ్మ వేడుకలను పురస్కరించుకుని సిద్దిపేట నియోజకవర్గంలోని ఎన్సాన్ పల్లి గ్రామంలో గల తులిప్స్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి శుక్రవారం ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులిప్స్ స్కూల్ కరస్పాండెంట్ తాటిపాముల నాగలతా కోటేశ్వర్, ప్రిన్సిపాల్ మిద్దె ప్రశంస, ప్రధానోపాధ్యాయులు బాలరాజు వెంకటేశం మాట్లాడుతూ బతుకమ్మ వేడుకలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేస్తాయని పేర్కొన్నారు. తమ స్కూల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు చక్కని క్రమశిక్షణతో మెదలుతూ తెలంగాణ పండుగల విశిష్టతను తెలుసుకునేందుకు



అన్ని పండుగలను స్కూల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు మంచి మార్కులు సాధించి తమ స్కూల్ కు, ఉపాధ్యాయులకు, వారి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకువచ్చేలా భగవంతుడు దీవెనలు ఇవ్వాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలలో స్కూల్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# అభివృద్ధి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్

**జగిత్యాల కలెక్టరేట్, అక్టోబర్ 09, :**
విబిజిరాంజీ కింద జిల్లాలో చేపట్టిన పలు అభివృద్ధి నిర్మాణ పనులు (గ్రామ పంచాయతీ భవనాలు, విలేజ్ ఆర్గనైజేషన్ (విఓ) భవనాలు, వంటశాలల నిర్మాణాలు, పాఠశాలల మరుగుదొడ్ల) నిర్మాణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బుదుమజ్జి సత్య ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన వివిధ నిర్మాణ పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో కొనసాగుతున్న గ్రామ పంచాయతీ భవనాలు, విలేజ్ ఆర్గనైజేషన్ భవనాలు, పాఠశాలల్లో వంటశాలలు, మరుగుదొడ్ల నిర్మాణ పనుల ప్రస్తుత స్థితిగతులు, ఇప్పటివరకు పూర్తయిన పనులు, ఇంకా పూర్తి కావాల్సిన పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు, విద్యార్థులకు ఉపయోగపడే ఈ నిర్మాణ పనులను నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయడానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, నిర్మాణాల్లో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి తగిన



చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పనుల్లో జాప్యం జరగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి చేపట్టిన పనులు ప్రజలకు త్వరగా అందుబాటులోకి వచ్చేలా చూడాలని పేర్కొన్నారు. ముఖ్యంగా పాఠశాలల్లో వంటశాలలు, మరుగుదొడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. అలాగే గ్రామ పంచాయతీ, విలేజ్ ఆర్గనైజేషన్ భవనాల నిర్మాణాలను కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పీఆర్ ఈఈ లక్ష్మణరావు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చురకలు



# రైతుల కోసం రాజీనామాకైనా సిద్ధం

- పంటలకు 18 గంటల విద్యుత్ ఇవ్వాలి.. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తాం..
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి హెచ్చరిక
- సబ్‌స్టేషన్ ఎదుట గంటపాటు రాస్తారోకో
- జాతీయ రహదారిపై భారీగా నిలిచిన వాహనాలు

**దుబ్బాక ప్రతినిధి, (అక్బర్‌పేట-భూంపల్లి), అక్టోబర్ 09, :**

రైతుల కష్టాల్లో ఎప్పుడూ అండగా ఉంటానని, అన్నదాతల ప్రయోజనాల కోసం అవసరమైతే తన పదవికి రాజీనామా చేయడానికైనా సిద్ధంగా ఉన్నానని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి స్పష్టం చేశారు. రైతులకు నిరంతరాయంగా 18 గంటల విద్యుత్ సరఫరా చేయాలని, లేనిపక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట– భూంపల్లి మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట జాతీయ రహదారిపై రైతులతో కలిసి శుక్రవారం ఆయన రాస్తారోకో నిర్వహించారు. సుమారు గంటపాటు సాగిన ఆందోళనతో రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో కూడవెల్లి వాగులోకి మల్లన్నసాగర్ ప్రాజెక్టు ద్వారా నీరు విడుదల చేసి సాగునీటి అవసరాలు తీర్చామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడవెల్లి వాగులోకి నీటిని విడుదల చేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. మరోవైపు వరి పంటకు కీలకమైన సమయంలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో పంటలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోజుకు కనీసం ఆరు గంటల విద్యుత్ కూడా సక్రమంగా సరఫరా కావడం లేదని రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే



పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

### విద్యుత్ శాఖ అధికారిని నిలదీసిన ఎమ్మెల్యే

రాస్తారోకో విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ డీఈ రామచంద్రయ్య ఘటనాస్థలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి విద్యుత్ సరఫరా ఎన్ని గంటలు జరుగుతోందో రైతులకు స్పష్టంగా తెలియజేయాలని అధికారిని నిలదీశారు. కనీసం ఆరు గంటల విద్యుత్ కూడా సక్రమంగా అందించకుండా రైతులను ఇబ్బందులకు గురిచేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయానికి నిరంతరాయంగా 18 గంటల విద్యుత్ సరఫరా చేయాలని, రైతుల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బక్కి వెంకటయ్యతో పాటు వివిధ మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ లో బీఆర్ఎస్ ధర్నా డ్రామానా?

- మేయర్ ఎన్నికప్పుడు ఈ సోయి ఎందుకు రాలేదు?
- కాంగ్రెస్ కరీంనగర్ కార్పొరేషన్ అధ్యక్షులు వైద్యుల అంజన్ ఫైర్

**కరీంనగర్ ప్రతినిధి, అక్టోబర్ 09, :**

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ లో శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ధర్నా కేవలం డ్రామా అని కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "మేయర్ ఎన్నిక సమయంలో మీకు ఈ ఆలోచన ఎందుకు రాలేదు? మేయర్ ఎన్నికల్లో బీజేపీ నాయకుడికి మద్దతు ఇచ్చి ఎలా గెలిపించారు? బీజేపీ అంటేనే పండుగలు, అభివృద్ధి కాదు, కేవలం హిందుత్వం పేరుతో ఓట్లు దండుకోవడమే. అలాంటి బీజేపీకి టీఆర్ఎస్ (బీఆర్ఎస్) ఏ విధంగా మద్దతు ఇచ్చింది? ఎన్ని కోట్ల రూపాయల కోసం ఈ మద్దతు? అభివృద్ధి కోసమా?



కరీంనగర్ ప్రజలు గమనిస్తున్నారు" అని ధ్వజమెత్తారు. టీఆర్ఎస్, బీజేపీల చీకటి ఒప్పందాలను ప్రజలు గమనించాలని ఆయన కోరారు. అదే విధంగా కరీంనగర్ లో రాబోయే బతుకమ్మ, దసరా పండుగల దృష్ట్యా మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో లైట్లు, శానిటేషన్ తదితర ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని కమిషనర్ ని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

# త్వరలోనే మెడికల్ కాలేజీ పూర్తి.. ముఖ్యమంత్రితో ప్రారంభం

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్
- అభివృద్ధి ఓర్వలేకే సీనియర్ నాయకుడి విమర్శలు
- పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి
- అభివృద్ధి కోసం ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్న
- అవసరమైతే సభ్యత్వం తీసుకుంటాన్న ఎమ్మెల్యే సంజయ్

**జగిత్యాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 09, :**

జగిత్యాల జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి నందయ్యతో కలిసి శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగిత్యాల అభివృద్ధి చేస్తూ ఉంటే సీనియర్ నాయకులు వారి స్థాయి తగ్గించుకొని మాట్లాడుతున్నారు. నూకపల్లి అర్బన్ హౌసింగ్ కాలనీ భూమిపూజ చేసిన సీనియర్ నాయకులు, దానికి రహదారి లేదు పేపర్ కూడా లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కాలనిలో డ్రైనేజీ వెళ్ళే పరిస్తితి లేదాని, నూకపల్లి అర్బన్ హౌసింగ్ కాలని స్థల సేకరణ ఒక స్కామని అన్నారు. స్థలం



నిరుపయోగంగా మారిందని మాజీ ఎంపీ కవిత సహకారంతో డబల్ బెడ్ రూమ్ ఇండ్ల కు భూమిపూజ చేయటం జరిగిందని తెలిపారు. జీవన్ రెడ్డి రెచ్చగొట్టే మాటలతో జగిత్యాల అభివృద్ధి పనులకు అడ్డం పడుతున్నారు. కేంద్రం జిఎస్టి పెంచడం వల్ల 8 కోట్ల అదనంగా మెడికల్ కాలేజీ పనులపై భారం పడిందని అన్నారు. జీవన్ రెడ్డి ఎమ్మెల్సీగా ఉండి ప్రభుత్వంతో ఉన్న 7 నెలల సమయంలో మెడికల్ కాలేజీ అర్బన్ హౌసింగ్ కాలని పనులు ఎందుకు పట్టించుకోలేదాని నిలదీశారు. ప్రభుత్వంతో కలసి పని చేస్తున్న, అవసరం అయితే సభ్యత్వం తీసుకుంటా, మెడికల్ కాలేజీ కి పాత బకాయిలు 40 కోట్లు మంజూరు చేయటం జరిగిందని అన్నారు. నలువైపులా డబల్ రోడ్డు మంజూరు చేసి పనులు కూడా జరుగుతున్నాయన్నారు. సంజయ్ కుమార్ జీవితం జగిత్యాల ప్రజలకు తెరచిన పుస్తకమని తెలిపారు. నాకు పేరు వస్తుందనే అనవసర ఆరోపణలు చేస్తున్నారున్నారు. రోల్లవాగు ప్రాజెక్ట్ అటవీ అనుమతుల కారణంగా ఆలస్యం అవుతున్నాయన్నారు. ముంపుకు గురవుతున్న అటవీ భూమి 827 ఎకరాలకు రెవెన్యూ భూమి ఇవ్వడం ద్వారా అటవీ అనుమతుల ప్రక్రియ ప్రారంభం అయిందని, అటవీ శాఖకు ఇంకా కొంత రెవెన్యూ భూమి కోసం సర్వే కూడా అవుతుందని తెలిపారు. మెడికల్ కాలేజీ పనులు కొంత అలస్యం అయ్యాయని, వైద్య విద్యార్థులు వారి ఆవేదన నిరసన తెలిపారు. నేను, కలెక్టర్ వెళ్ళి మాట్లాడగా వారు మాకు సన్మానం చేశారు. త్వరలోనే పనులు పూర్తి చేస్తామని , ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. ప్రజా సేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చానని, 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. వేజ్ నాన్ వెజ్ మార్కెట్ త్వరలోనే ప్రారంభిస్తామని, అభివృద్ధికి అడ్డం పడాలని అజెండా పెట్టుకొని విమర్శలు చేస్తున్నారాని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ అడువల జ్యోతి లక్ష్మణ్, గిరి నాగభూషణం, టీపిసిసి సెక్రటరీ బండ శంకర్, కో ఆప్షన్ సభ్యులు గట్టు సతీష్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు దుమల రాజ్ కుమార్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కుసరి అనిల్, సభ్యులు కత్రోజ్ గిరి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీరం రాజేష్, కాంగ్రెస్ సేవాదళ్ స్టేట్ సెక్రటరీ ముకేష్ ఖన్నా, టౌన్ యూత్ అధ్యక్షులు దయల శరత్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాల ఆల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ఘనంగా ముందస్తు బతుకమ్మ వేడుకలు

**జగిత్యాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 09, :**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని జగిత్యాల ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో, కృష్ణానగర్, శివవీధి, విద్యానగర్ పాఠశాలలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వూట్కూరి నరేందర్ రెడ్డి పాల్గొని మొదటగా అమ్మవారి విగ్రహానికి పూలమాల వేసి బతుకమ్మలకు జ్యోతి వెలిగించి అట్టహాసంగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ నరేందర్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ మహిళల ఆత్మగౌరవానికి, ఐక్యతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. విద్యార్థినులు, అధ్యాపకులు సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని, రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించారు. అనంతరం బతుకమ్మల చుట్టూ సంప్రదాయ ఆటపాటలతో ఉత్సాహంగా వేడుకలు జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని ప్రతిబింబించేలా కార్యక్రమం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఆల్ఫోర్స్ కళాశాలల, పాఠశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.





# బిజెపి, బిఆర్ఎస్ లకు ప్రజాక్షేత్రంలో పరాభవం తప్పదు

- ప్రజల బాగోగులు మరిచి ఉనికి కోసం డ్రామాలు
- కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి అనంతుల రమేష్

**కరీంనగర్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 09, :**

పదేళ్ల అధికారంలో ఉండి అడ్డగోలు అవినీతికి పాల్పడి ప్రతిపక్ష పాత్ర నిర్వహించకుండా వ్యవహరిస్తున్న బిఆర్ఎస్, నగర మేయర్ పీఠము కైవాసం చేసుకుని ఎనిమిది నెలలు గడుస్తున్న అభివృద్ధి పట్టని బిజెపి వైఖరితో నగర ప్రజలు అసహ్యించుకుంటున్నారని, రానున్న రోజుల్లో ఆ రెండు పార్టీలకు ప్రజల చేతిలో చిత్కారం తప్పదని జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి అనంతుల రమేష్ హెచ్చరించారు. శుక్రవారం తీగలగుట్టపల్లి 3 వడివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎల్నీనోతో వర్షా బావ పరిస్థితుల వలన నీటి ఎద్దడి కరువు పరిస్థితులు కరెంటు కోతలు తదితర సమస్యలతో ప్రజలు ఉంటే బాధ్యతాయుతమైన ప్రతిపక్షంలో ఉన్న బిఆర్ఎస్, బిజెపి పార్టీలు ప్రభుత్వానికి సూచనలు సలహాలు ఇస్తూ ప్రజలకు అండగా ఉండాల్సింది పోయి అధికారకాంక్షతో నిత్యం రాజకీయం చేయడం రెండు పార్టీలకు చెల్లిందని విమర్శించారు. 8 నెలల క్రితం కార్పొరేషన్ ఎన్నికల్లో అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన బిజెపి వైఖరిని నగర ప్రజలు కొద్దిరోజుల్లోనే గమనించారని రెండు పార్టీల నేతల చీకటి ఒప్పందాలు పదవుల పంపకాలు తెలియనవికాదని ఈ రెండు పార్టీలు తమ ఉనికి కోసం ఆడే డ్రామాలకు ఇకనైనా తెరదించాలని డిమాండ్ చేశారు. డంపు యార్డుతో నగర ప్రజలు అనేక అవస్థలు పాలవుతున్నారని, రైల్వే ఓవర్ బ్రిడ్జి నత్తనడక పనుల వలన నాలుగేళ్లుగా ప్రజలు నరకయాతనపడుతున్నాని, ఎల్నీనో ప్రభావం వల్ల భూగర్భ



జలాలు అడుగంటిపోయి తీవ్ర నీటి ఎద్దడి మొదలైందని ఇలాంటి ఎన్నో సమస్యలతో ప్రజలు సతమతమవుతుంటే బీజేపీ నిత్యం రాజకీయ రగడతో అనవసర అల్లర్లకు ఆజ్యం పోయడం సిగ్గుచేటని అన్నారు. ఇకనైనా బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు తీరు మార్చుకోవాలని హితవు పలికారు. పథకం ప్రకారమే మేయర్ పీఠం బిజెపికి కట్టబెట్టిన బిఆర్ఎస్ బిజెపిని విమర్శించడం, బిఆర్ఎస్ అండతోని నగరపాలక సంస్థపై జెండా ఎగురవేసిన బిజెపి 8 నెలలుగా చేసింది శూన్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మూల క్రిష్ణారెడ్డి, కూన దామోదర్ తదితరులు పాల్గొన్నారు

# బతుకమ్మ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- అధికారులకు మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి సూచన

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 09, :**



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలో ఘనంగా, ఆనందోత్సాహాల మధ్య, సురక్షితంగా నిర్వహించేందుకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి సూచించారు. పండుగను పురస్కరిం చుకుని పట్టణాలు, గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, విద్యుత్ సౌకర్యం, రహదారుల మరమ్మతులు, తాగునీటి సరఫరా, భద్రత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన పేర్కొన్నారు. బతుకమ్మ వేడుకలు నిర్వహించే ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి భూపతిరెడ్డి మాట్లాడుతూ.. “బతుకమ్మ అంటే కేవలం పూల పండుగ మాత్రమే కాదు.. తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక. మన సంస్కృతి, సంప్రదాయాలు, ప్రకృతితో ముడిపడిన అపురూపమైన పండుగ. ప్రతి ఆడబిడ్డ ఆనందంగా, ప్రతి కుటుంబం సంతోషంగా, ప్రతి గ్రామం సురక్షితంగా బతుకమ్మ వేడుకల్లో పాల్గొనేలా ప్రజా ప్రభుత్వం అవసరమైన ఏర్పాట్లు చేస్తోంది” అని తెలిపారు. తెలంగాణ సంస్కృతి వైభవాన్ని చాటిచెప్పే బతుకమ్మ పండుగను ప్రజలంతా ఐక్యంగా, ఉత్సాహంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

# ప్రభుత్వ కాంట్రాక్టు ఉపాధ్యాయురాలికి వేతనం అందజేత

- కేపీహెచ్‌బీలోని ప్రభుత్వ పాఠశాలకు చేయూత

**కూకట్పల్లి ప్రతినిధి, అక్టోబర్ 09, :**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆదర్శమైన 'సేవా హీ సంఘటన్', 'జాతి ప్రథమం' స్ఫూర్తితో కేపీహెచ్‌బీలోని ప్రభుత్వ పాఠశాల కాంట్రాక్టు ఉపాధ్యాయురాలి వేతనానికి ఆర్థిక సహాయం అందించే కార్యక్రమాన్ని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ పవన్ కుమార్ నర్వ గత కొన్ని సంవత్సరాలుగా కొనసాగిస్తున్నారు. శుక్రవారం కేపీహెచ్బి కాలనీ నాలుగవ ఫేజ్ ప్రభుత్వ పాఠశాల కాంట్రాక్టు ఉపాధ్యాయురాలి వేతనాన్ని తన వంతు ఆర్థిక



సహాయంగా అందజేశారు. ఈ సందర్భంగా వేతనానికి సంబంధించిన చెక్కును ఉపాధ్యాయురాలికి అందజేశారు. అనంతరం బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ నర్వ పవన్ కుమార్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నరేంద్ర మోదీ స్ఫూర్తితో విద్యా రంగానికి తన వంతు సహాయ సహకారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాల కాంట్రాక్టు ఉపాధ్యాయురాలి వేతనాన్ని గత ఐదు సంవత్సరాలుగా తాను అందిస్తున్నట్లు తెలిపారు. గుజరాత్ సీఎంగా మొదలై దేశ ప్రధానిగా మోదీ సాగించిన పాతికేళ్ల ప్రయాణం సుపరిపాలనకు, నిస్వార్థ సేవకు నిదర్శనమని పేర్కొన్నారు. నిజమైన సేవ మాటల్లో కాక చేతల్లోనే ఉంటుందని, అట్టడుగు స్థాయి విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. వికసిత భారత్–2047 లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ సమాజ సేవకు కట్టుబడాలని ఆయన పిలుపునిచ్చారు.

# కాంగ్రెస్ అల్పసంఖ్యాకుల విభాగం అధ్యక్షుడిగా మొహమ్మద్ చన్ను పాషా

## బండి రమేష్ ఘన సన్మానం



**కూకట్పల్లి ప్రతినిధి, అక్టోబర్ 09, :**
కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ అల్పసంఖ్యాకుల అధ్యక్షుడిగా నియమితులైన మొహమ్మద్ చన్ను పాషాను టీపీసీసీ ఉపాధ్యక్షుడు, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండి రమేష్ శుక్రవారం ఘనంగా సన్మానించారు. పార్టీ కార్యాలయం హేమ దుర్గా భవన్‌లో చన్ను పాషాకు శాలువా కప్పి, స్వీట్లు అందించి అభినందించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి మైనారిటీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజాసమస్యలపరిష్కారానికి కృషి చేయాలనిసూచించారు. ఈ కార్యక్రమంలోలక్ష్మయ్య, నవాజ్, పాషా, అక్బర్, సచిన్, బర్కత్ అలీ, ప్రసన్న కుమార్, అస్లాం, పర్వేజ్, రమణ, ఖాజా, రమాదేవి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా జెల్ల శివకుమార్



**కూకట్పల్లి ప్రతినిధి, అక్టోబర్ 09, :**
మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన జెల్ల శివకుమార్ కూకట్‌పల్లిలోని శ్రీహేమ దుర్గా భవన్‌లో శుక్రవారం టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ సమక్షంలో నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా బండి రమేష్ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, ప్రసన్నకుమార్, రమణ, బర్కత్ అలీ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# పీఎం విశ్వకర్మ యోజన కింద వాషింగ్ మిషన్ల పంపిణీ



**దుబ్బాక ప్రతినిధి, అక్టోబర్ 09, :**
మెదక్ ఎంపీ రఘునందన్ రావు సహకారంతో ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనలో భాగంగా దుబ్బాక మండల కేంద్రంలో 18 మంది రజక (ధోబీ) వృత్తిదారులైన లబ్ధిదారులకు వాషింగ్ మిషన్లను బీజేపీ నాయకులు అందజేశారు.రజక వృత్తిదారుల జీవనోపాధిని మెరుగుపరచడం, వారి వృత్తి అభివృద్ధికి తోడ్పడటం, ఆధునిక పరికరాల ద్వారా వారి పనిని సులభతరం చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని వారు అన్నారు. ఈ పథకం ద్వారా సంప్రదాయ వృత్తిదారులకు ఆర్థికంగా, వృత్తిపరంగా మరింత ప్రోత్సాహం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో 8 వార్డు కౌన్సిలర్ మెరుపుల సాయి కుమార్, బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్, సుంకోజి ప్రవీణ్, రవీందర్, తదితరులు

# వ్యవసాయానికి నాణ్యమైన కరెంటు అందించాలి

## బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిరసన

**కుకునూరుపల్లి, అక్టోబర్ 09, :**

వ్యవసాయానికి నాణ్యమైన కరెంటు అందించాలని మండల బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందించారు. అనంతరం మండల కేంద్రంలో బీజేపీ శ్రేణులు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. రైతులకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం, క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రోడ్డుపై బైఠాయించిన బీజేపీ నాయకులను ఎస్సై బాలకృష్ణ కుకునూరుపల్లి పోలీసు స్టేషన్ కు తరలించి, ట్రాఫిక్ ను క్లియర్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

# గడువులోగా మెడికల్ కళాశాల నిర్మాణ పనులు పూర్తి చేయాలి

- విద్యార్థుల సమస్యల పరిష్కారానికి, మౌలిక వసతుల కల్పనపై ఆర్అండ్‌బీ అధికారులతో సమీక్ష



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 09, :**
మెడికల్ కళాశాల విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆదేశాల మేరకు ఆర్అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారులు శుక్రవారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, మెడికల్ కళాశాల విద్యార్థి నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. మెడికల్ కళాశాల నిర్మాణ పనుల పురోగతి, విద్యార్థుల సమస్యలు, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై సుదీర్ఘంగా చర్చించారు. జగిత్యాల మెడికల్ కళాశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఆర్అండ్‌బీ ఇంజినీరింగ్ శాఖ అధికారులు తెలిపారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను సకాలంలో అందుబాటులోకి తీసుకురావాలని, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కళాశాలలో ఇంకా పూర్తికావాల్సిన నిర్మాణ పనులను గుర్తించి, వాటిని వేగవంతంగా పూర్తి చేయాలని ఈ సందర్భంగా సూచించారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా తరగతి గదులు, ఇతర అవసరమైన వసతులను అందుబాటులోకి తీసుకురావడంపై దృష్టి సారించాలని తెలిపారు. పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టి, నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆర్అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారులు నిర్మాణ పనులన్నింటినీ విద్యార్థులకు ఇచ్చిన హామీ మేరకు నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్‌కు, విద్యార్థి నాయకులకు హామీ ఇచ్చారు. పనుల పూర్తిలో జాప్యం జరగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మెడికల్ కళాశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడంతో పాటు, వారి సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులు సూచించారు. నిర్మాణ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తయ్యేలా పర్యవేక్షణ కొనసాగించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్, ఆర్అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

# కాలేజీ స్క్రాప్ విక్రయంలో నిబంధనలకు తూట్లు

- దుబ్బాక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అమ్మకాలపై ఆరోపణలు

**దుబ్బాక ప్రతినిధి, అక్టోబర్ 09, :**
దుబ్బాక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సంబంధించిన పాత వస్తువులు, పనికిరాని సామగ్రి విక్రయ వ్యవహారం వివాదాస్పదంగా మారింది. సిద్దిపేట జిల్లా దుబ్బాక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్క్రాప్ అమ్మకాల సమయంలో నిబంధనలు పాటించలేదని, విక్రయ ప్రక్రియలో పారదర్శకత లోపించిందని పలువురి నుండి ఆరోపణలు వ్యక్తమవు తున్నాయి. ప్రభుత్వ కళాశాలలకు చెందిన పాత వస్తువులు, పనికిరాని సామగ్రిని విక్రయించాలంటే నిబంధనల ప్రకారం సంబంధిత ఉన్నతాధికారుల అనుమతులు తీసుకోవడంతో పాటు, విక్రయించనున్న వస్తువుల వివరాలను స్పష్టంగా నమోదు చేయాలి. అలాగే వర్తించే నిబంధనల ప్రకారం టెండర్ ప్రక్రియ చేపట్టి, కొనుగోలుదారుల నుంచి ధరల ప్రతిపాదనలు ఆహ్వానించి, పారదర్శకంగా విక్రయాలు జరపాల్సి ఉంటుంది. అయితే దుబ్బాక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్క్రాప్ విక్రయాల సందర్భంగా ఈ విధానాలను అనుసరించారా..!? ఉన్నతాధికారుల నుంచి ముందస్తు అనుమతులు తీసుకున్నారా..!? టెండర్ ప్రకటన ఇచ్చి పోటీ ధరలను ఆహ్వానించారా..!? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కళాశాల ప్రిన్సిపాల్ వ్యవహారశైలిపై కూడా ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో విక్రయాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు ప్రభుత్వ ఆదేశాల మేరకు జూనియర్ కళాశాలల నిర్వహణ, మరమ్మతులు, ఇతర అవసరాల కోసం ఇంటర్మీడియట్ విద్యాశాఖ వివిధ గ్రాంట్ల రూపంలో నిధులు విడుదల చేస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ ఆస్తుల విక్రయాల్లో నిబంధనలను పాటించారా లేదా అన్నది కీలకంగా మారింది.

**విచారణ జరిపితేనే వాస్తవాలు వెలుగులోకి..!**

స్క్రాప్ విక్రయాలకు సంబంధించిన అనుమతి పత్రాలు, వస్తువుల జాబితా, టెండర్ వివరాలు, విక్రయం ద్వారా వచ్చిన మొత్తానికి సంబంధించిన రికార్డులను సంబంధిత అధికారులు పరిశీలించాలని పలువురు కోరుతున్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత



అధికారులు ఈ ఆరోపణలపై ఎలా స్పందిస్తారో, ఎలాంటి చర్యలు చేపడతారో వేచి చూడాలి.

# తల్లిదండ్రులు లేని 11 మంది విద్యార్థులకు డ్రెస్సుల పంపిణీ

- సిద్దిపేట ప్రీమియర్ లీగ్ అధ్యక్షులు వినోద్ మోదాని అండదండలు

**దుబ్బాక ప్రతినిధి, అక్టోబర్ 09: :**
పండుగల అసలైన ఆనందం మనం పొందే సంతోషంలోనే కాకుండా, ఆ సంతోషాన్ని ఇతరులతో పంచుకోవడంలోనూ ఉందని సిద్దిపేట ప్రీమియర్ లీగ్ వ్యవస్థాపక అధ్యక్షులు వినోద్ మోదాని చాటిచెప్పారు. దుబ్బాక మున్సిపాలిటీ ధర్మాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న తల్లిదండ్రులు లేని 11 మంది విద్యార్థులకు దసరా పండుగ కానుకగా శుక్రవారం నూతన (డ్రెస్) వస్త్రాలను అందజేసి, వారికి మేనమామగా అండగా నిలిచారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులతో కలిసి నిర్వహించిన ఈ సేవా కార్యక్రమం విద్యార్థుల్లో ఆనందాన్ని నింపడంతో



పాటు పలువురికి స్ఫూర్తిదాయకంగా నిలిచారు. పాఠశాలలో 6 వ తరగతి నుంచి 10 వ తరగతి వరకు చదువుతున్న ఈ విద్యార్థులకు కొత్త బట్టలు అందజేయడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందని వినోద్ మోదాని తెలిపారు. సమాజంలో ప్రతి ఒక్కరూ తమకు చేతనైన రీతిలో ఇతరులకు సహాయం చేస్తూ, ముఖ్యంగా పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడాలని ఆయన పిలుపునిచ్చారు. మనమెంత సంపాదించామన్నది ముఖ్యం కాదని మన సంపాదనలో నుంచి ఎంత మందికి సహాయం చేయగలిగామన్నదే నిజమైన గొప్పతనం అన్నారు. సమాజంలోని నిరుపేదలకు అండగా నిలిచి, వారు జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగేందుకు మన వంతు సహకారం అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట ప్రీమియర్ లీగ్ సభ్యులు వీరబత్తిని సత్యనారాయణ, ఆకుల పాండురంగం, రాజ బహదూర్ రెడ్డి, బిఎల్ శ్రీనివాస్, చికోటి చంద్రశేఖర్, పాఠశాల ఉపాధ్యాయులు పల్లె శ్రీనివాస్ గౌడ్, కె వెంకట కృష్ణమాచారి, శ్రీకాంత్, పి బాలకృష్ణ, వి శైలజ, ఎస్ దినేష్, రేణుక, ఎస్డి వహీద్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వేద ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**కుకునూరుపల్లి, అక్టోబర్ 09, :**
కుకునూరుపల్లి మండల కేంద్రంలోని వేద ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్బంగా పాఠశాల కరస్పాండెంట్ సంతోష్ మాట్లాడుతూ ఈ పండుగ తెలంగాణ సంస్కృతికి, ప్రకృతికి మహిళల గౌరవానికి ప్రతీక అని, బతుకమ్మ అంటే తల్లి దేవత ప్రాణంతో ఉంటుందని ఈ పండుగ గౌరమ్మను పూజించడం ద్వారా కుటుంబాల ఆరోగ్యం, శ్రేయస్సు కోసం ప్రార్థిస్తారని, విద్యార్థులకు పండుగ విశేషాలను వివరించారు. ఈ వేడుకలలో విద్యార్థినిలు ఉత్సాహంగా పాల్గొని రంగు రంగు పూలతో బతుకమ్మను అందంగా పేర్చి, బతుకమ్మ పాటలకు అనుగుణంగా నృత్యలు చేస్తూ పాఠశాల ఆవరణలో సందడి చేసారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సంతోష్, డైరెక్టర్ శోభా రాణి, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# జపాన్ ఇంటర్నేషనల్ సేల్స్ సర్వీస్ ను ప్రారంభించిన వంగ రాజేశ్వర్ రెడ్డి



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 09, :**
సిద్దిపేట పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన జపాన్ ఇంటర్నేషనల్ సేల్స్ సర్వీస్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి యువ పారిశ్రమికవేత్త వంగ రాజేశ్వర్ రెడ్డి శుక్రవారం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా షాప్ నిర్వాహకులు, ఎండీ సల్మాన్ కి శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా ప్రారంభించిన వ్యాపారం విజయవంతంగా కొనసాగుతూ మరింత అభివృద్ధి సాధించాలని వంగ రాజేశ్వర్ రెడ్డి ఆకాంక్షించారు. వ్యాపారంలో మంచి గుర్తింపు సంపాదించుకుంటూ ముందుకు సాగాలని సల్మాన్ కి శుభాకాంక్షలు తెలియజేశారు.



# శక్తి స్వరూపిణి బతుకమ్మ

ప్రతి పండుగ పరంపరానుగతంగా ప్రత్యేక శైలిలో, విశిష్ట పద్ధతిలో జరుపుకునే ధార్మిక కార్యాచరణాసక్తుల నిలయమైన తెలంగాణలో ఆపురూప సోదరీమణులైన జేష్టాదేవి, లక్ష్మీ దేవిలను కొలుస్తూ, బొడ్డెమ్మ, బతుకమ్మ పండుగలను భక్తి శ్రద్ధలతో, పిల్లా పాపలతో కలిసి మహిళలు జంట పండు గలుగా పక్షం రోజుల తేడాతో నిర్వహించడం అనాదిగా ఆచరిస్తున్న సనాతన సాంప్రదాయం. బతుకునిచ్చే తల్లిని లక్ష్మీ గౌరి దేవిలను అభేదిస్తూ, శక్తి రూపంగా ఆటపాటల ద్వారా పూజిస్తూ, ఉన్నంతలో రకరకాల పదార్థాలను నివేదిస్తూ, కొత్త బట్టలు నగలు ధరిస్తూ, ఆడ బిడ్డలను ఆహ్వానిస్తూ, కలిసి జరుపుకునే పండుగ బతుకమ్మ. బతుకమ్మను పేర్చే విధానం, పూజించే తీరును బట్టి, తనను ఆరాధించడానికే శక్తిమాత ఆ రూపాన్ని కోరిందా అని అనిపిస్తుంది. శ్రీ చక్ర ఉపాసన సర్వోత్కృష్టమైన శక్తి ఆరాధన విధానాలలో ఒకటి. బతుకమ్మను పేర్చేటప్పుడు, కమలం షట్చక్రికం/ అష్టదళ పద్మాన్ని వేసి పేర్చడం ఆనవాయితీ. శ్రీచక్రం లోని మేరు ప్రస్తానం బతుకమ్మ ఆకారాన్ని పోలి ఉంటుంది. శ్రీచక్రం లోని కుండలినీ యోగ విశేష శక్తిగా బతుకమ్మలో గౌరమ్మను నిలపడం చేస్తారు. ప్రధానంగా తెలంగాణ స్త్రీలు గౌరమ్మను,గౌరీ, లక్ష్మి సరస్వతులుగా త్రిగుణాత్మ స్వరూపిణిగా భావించి పూజిస్తారు. “శ్రీలక్ష్మి నీమహిమలూ గౌరమ్మ భారతి సతివయ్యి బ్రహ్మకిల్లాలిపై పార్వతి దేవివై పరమేశు రాణివై, భార్యవైతివి హరునకు గౌరమ్మా అంటూ పాడుకోడవడం విశేషం”. భాద్రపద అమావాస్య మహాలయ అమావాస్య లేక ఎంగిలిపూల బతుకమ్మ అని పిలుస్తూ, ఆనాటితో ప్రారంభించి మహర్నవమితో ముగించ బడే బతుకమ్మ పండుగ, ఆట పాటలతో నిర్వహించి, పిల్లా పాపలతో మహిళలు తన్మయత్వం పొందుతారు. ప్రతిరోజు వివిధ పిండి వంటలను ఆరగించడం చేత అనారోగ్యం పాలు కాకుండా ఉండేందుకు అర్రెమి పేరుతో ఆరవరి రోజు సెలవు తీసుకుంటారు. ఇళ్లలో ప్రతిరోజు ఒకరిని మించి మరొకరు పోటీలు పడుతూ గ్రామ పొలి మేరలో, పంట చేలలో, ఇళ్ళల్లో, పరిసర ప్రాంతాలలో లభ్యమయ్యే తంగేడు, గునుగు, బంతి, గన్నేరు, కట్ల, గోరింట, గుమ్మడి తదితర పూలతో పసుపు గౌరమ్మదేవతా విగ్రహాన్ని పళ్ళెములో అందంగా, ఆకర్షణీయంగా పేర్చుతారు. నిత్య నూతన వస్త్ర దారులై, సాయంత్రం వేళ, బృందాలుగా పలు రకాల పిండి వంటలతో ఊరి బయటకు, జలాశయాల వద్దకు వెళతారు. మధ్యలో బతుకమ్మలను ఉంచి వృత్తాకారంలో ఆడుతూ, పాడుతూ లయ బద్ధంగా అడుగులేస్తూ, పదానికి పదం కలుపుతూ, శాస్త్రీయంగా నృత్యం చేస్తారు. వెంట తెచ్చుకున్న తిను బండారాలను ముందుగా నైవేద్యం పెట్టి, బతుకమ్మను నీటిలో నిమజ్జనం గావిస్తారు. అనంతరం పిండి వంటలను తోటివారికి పంచుతూ, పిల్లలతో ఒకేస్థలంలో కూర్చుండి ముత్తయిదులు సామూహికంగా ఆరగిస్తారు. సాయంత్ర మంతా ఆహ్లాదకర వాతావరణంలో గడిపి, చీకటి పడ్డాక ఇళ్లకు చేరుకుంటారు. “చేమంతి వనములో భామలు చెలికుంటలో భామలు, ఓలలా డినారు” అంటూ గొల్ల భామలు – శ్రీకృష్ణుడు పాటలు; “రాత్రి వచ్చిన సాంబ శివుడు ఎంతటి మాయల వాడే అమ్మ, “చిత్తూ చిత్తుల బొమ్మ శివుడీ ముద్దుల గుమ్మ బంగారు బొమ్మ దొరికెనమ్మ ఈ వాడలోన” అంటూ శివ పార్వతుల గురించి; బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో బంగారు బతుకమ్మ ఉయ్యాలో.. ఒక్కేసి పువ్వేసి చందమామ అంటూ బతుకమ్మ గూర్చి; “జనకునింటి ఉయ్యాలో” అంటూ భూజాత యైన మహాసాధ్వి సీతాదేవి గురించే గాక “కలవారి కోడలు కలికి కామాక్షి”అంటూ సామాజిక అంశాల సమస్యలపై సైతం జాన పద బాణీలో బృందగానం చేసే సాంప్రదాయ గీతాలు మంత్ర ముగ్ధులను గావిస్తాయి. అన్ని వర్గాలు కలిసి ఆడడంలో మానవ సంబంధాలు, సమిష్టి భావనలు పెంపొందడంతో పాటు భారత దేశ ఔన్నత్యాన్ని తెలంగాణ ప్రాశస్త్యాన్ని తెలిపే సాంస్కృతిక వారసత్వం తరతరాలుగా కొన సాగుతున్నది. కౌటుంబిక, చారిత్రక, పౌరాణిక, సంబంధ బాంధవ్యాల, సామాజిక అంశాలతో ఉన్న జానపద పాటల వల్ల అపురూప సాహిత్యాన్ని, వారసత్వాన్ని భావి తరాలకు అందించడం జరుగు తున్నది. కుల, మత, వర్గ, పేద, ధనిక భేదాలు లేకుండా, సమిష్టిగా, సామూహికంగా ప్రకృతి ఆరాధన భాగంగా జరుపుకునే బతుకమ్మ పండుగ చర్విత చర్వణంగా సాగుతున్న నిత్య లోకిక జీవనంలో ఒకింత మార్పు తెస్తూ, నూతనో త్సాహం, సోదర భావాన్ని అలౌకిక ఆనందాన్ని అన్నింటిని మించి సామూహిక భాగ స్వామ్యాన్ని పెంపొందించ గలదనే పరిపూర్ణ విశ్వాసంతో, బతుకమ్మ వేడుకలను మహిళలు ఆనందోత్సవాలతో ఏ యేటి కాయేడు పాల్గొంటున్నారు.



రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# ఒత్తిళ్లే మానసిక వైకల్యానికి మూలం

## మానసిక ఉద్రేకాల నిగ్రహం అవసరం



### నేడు 'ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం'

ప్రతీ ఏడాది అక్టోబర్ 10న 'ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం' జరుపు కుంటున్నాం. నేటి ఔతాహిక యువ తరంలో శారీరక సమస్యలతో పాటు మానసిక సమస్యలు ఉన్న వారి సంఖ్య పెరుగుతోంది. కొందరు వాటిని బయటకు చెప్పుకోలేక సత మవుతూ ఉంటారు. సమాజం వాటిని మరొక కోణం లోనే చూస్తున్న. ఈ నేపథ్యంలో మానసిక అనారోగ్య సమస్యను సాధారణ అనారోగ్యంగా భావించాలని తెలి పేందుకే ఈ రోజు నిర్వహిస్తున్నారు. 1992లో వరల్డ్ ఫెడరేషన్ ఫర్ మెంటల్ హెల్త్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మనిషి పుట్టాక ఎలాంటి వైకల్యం లేకుండా ఉంటే అతడి జీవితం హ్యాపీగా సాగుతుంది. ఐతే చిన్న వైకల్యం ఉన్నా అది జీవితాంతం అతడిని పీడిస్తుంది. ఐతే కొందరు పుట్టుకతో ఆరోగ్యకరంగా బాగానే ఉన్నప్పటికీ హఠాత్తుగా మానిసిక రోగులుగా మారి పోతుంటారు. నిజానికి మనలో 40 శాతం పిచ్చి వాళ్ళేననేది నిపుణుల అంచనా అది మెడికల్ అనాలిసిస్ మాత్రమే. ఇంకా ఫ్రాంకుగా, నిఖార్సుగా చెప్పాలంటే పూర్తి నార్మల్ గా వుండేవాళ్లు బహుశా ఏ రెండు శాతమో వుంటారు. మనచుట్టూ ఎంత అబ్ నార్మాలిటీ?! ఎన్ని వింత పోకడలు? తిండి పిచ్చి, డబ్బు పిచ్చి, నగల పిచ్చి, పుస్తకాల పిచ్చి పేరుపిచ్చి, సినిమాల పిచ్చి.. గొప్పలు చెప్పడం, అప్పులు చేయడం ఆడంబరాలు పోవడం, షాపింగు, అతి వాగుడు, మితిమీరిన కోపం... వైద్య పరి భాషలో డిప్రెషన్, యాంగ్జయిటీ, యాంగ్జయిటీ న్యూరోసిస్, బైపోలార్ డిజార్డర్, సోషల్ యాంగ్జయిటీ డిజార్డర్, పానిక్ డిజార్డర్, అబ్సెసివ్ కంపల్సివ్ డిజార్డర్, పోస్ట్ ట్రమాటిక్ స్ట్రెస్ డిజార్డర్, ఫోబియా, మానియా స్కిజోఫ్రీనియా, డిల్యూషనల్ డిజార్డర్, స్లీప్ డిజార్డర్ ఇన్సోమ్నియా), ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్, సుపీరియారిటీ కాంప్లెక్స్ ఇల్యూషన్, అడిక్షన్ లాంటి మానసిక వైకల్యాలు అనేకం ఉన్నాయి. స్థూలంగా చెప్పాలంటే మానసిక ఉద్రేకాలను నిగ్రహించు కోలేకపోవడమే రుగ్మతను తెచ్చి పెడ్తుంది. ఏ లక్షణమైనా సరే అవధులు దాటినప్పుడు అది పిచ్చి చేష్ట అవుతుంది. హద్దుల్లో మనం వుండి, బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తున్నంత వరకు ఎవరూ మనని తప్పుపట్టారు. మానసిక వైకల్యం వచ్చిన వారిలో సగానికి పైగా 14 ఏళ్ల లోపు వయసు నుంచి ఈ సమస్య ప్రారంభ మవుతుంది. మొత్తం 20 శాతం మంది బాల బాలికల్లో ఈ అవలక్షణం ఉన్నట్లు తేలింది. భయంకర సంఘటనలు, సామాజిక పరిస్థితుల కారణంగా మానసిక వైకల్యం చెందడం సర్వ సాధారణమైన కారణంగా చెపుతారు. మానసిక సమస్యతో బాధపడే వారిని గుండె సంబంధిత సమస్యలు, మధుమేహం, గ్యాస్ట్రిక్ సమస్యలు కూడా వెంటాడుతాయి. మానసికంగా బలహీనంగా ఉన్నవారు పూర్తిగా ఆ సమస్యలో కూరుకుపోవడానికి కారణం సదరు వ్యక్తి కుటుంబ సభ్యులు కూడా కారణవ-వుతున్నారు. సమాజంలో మానసిక అనారోగ్యంతో బాధ పడుతున్న వారికి కొన్ని ప్రత్యేక లక్షణాలు ఉన్నాయి. 1). సంఘానికి వ్యతిరేకంగా ప్రవర్తించడం....




కొంతమంది వ్యక్తులు ప్రత్యేకించి కొన్నిసార్లు విపరీతమైన కోపాన్ని ప్రదర్శిస్తిస్తూ అరుస్తూ పిచ్చిగా ప్రవర్తిస్తుంటారు. వీరి ప్రవర్తన ఇతరులకు హాని కలిగించేదిగా ఉంటుంది. 2). అమ్నోసియా... ఇది కూడా సర్వసాధారణంగా కనబడేదే. వీరిలో కనిపించే లక్షణం మర్చిపోవడం. బ్రెయిన్ డ్యామేజ్ కారణంగా చెప్పినవి, జరిగినవి మర్చి పోతుంటారు. 3). ఆస్పర్జెర్స్ సిండ్రోమ్.... వీరిని కూపస్త మండూకాలని చెప్పవచ్చు. సమాజంలో ఎవ్వరితోనూ వీరికి సంబంధాలు ఉండవు. ఒంటరిగా ఉండేందుకు ఇష్టపడుతుంటారు. ఎవరితోనూ మాట్లాడేందుకు ఇష్టపడరు. ప్రత్యేకమైన వ్యక్తులుగా అగుపిస్తుంటారు. 4). మహా ఒత్తిడి... ఈ ఒత్తిడి అనేది చాలా పెద్దపదం. దీని కారణంగా చాలామంది ప్రాణాలు తీసుకున్న సంఘటనలున్నాయి. ఈ ఒత్తిడి సమస్య కారణంగా వారిపై వారికి నమ్మకం సన్నగిల్లుతుంది. సంతోష కరమైన పండుగలు ఇతరత్రా ఏవి వచ్చినా వాటిని జరుపు కునేందుకు ఆసక్తి చూపరు. ప్రతిదాన్ని విమర్శిస్తూ తిట్టుకుంటూ ఉంటారు. నలుగురితో కలిసి తిరగడం వీరికి అస్సలు ఇష్టం ఉండదు. ఇలాంటి వారి మానసిక స్థితిని మామూలు స్థితికి తీసుకు రాకపోతే ఆత్మ హత్యలకు పాల్పడేందుకు అవకాశం ఉంటుంది. 5). ఓసీడీ... ఒబెసివ్ కంపల్సివ్ డిజార్డర్... అంటే వీరు ఒకరకంగా మతిమరుపు టైపే. పెట్టిన చోట వస్తువు ఉందో లేదో అని పదేపదే చెక్ చేసుకుంటూ ఉంటారు. అలాగే ప్రతి చిన్నదానికి చేతులు కడుక్కోవడం, ఇంట్లో ఉన్న వస్తువులను లెక్కబెట్టడం, అకస్మాత్తుగా స్నానం చేయడం, తలుపులు వేసి ఉన్నాయో లేదో అని పలుమార్లు చెక్ చేసుకోవడం వంటివి చేస్తుంటారు. అలాగే వదిలేస్తే ఇవి కూడా ఆ వ్యక్తిలో ఆత్మహత్యల వైపు తీసుకెళతాయి. కాబట్టి మానసిక వైకల్యం ఉన్న వారి విషయంలో కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకో వలసిన అవసరం ఉంటుంది.

వృద్ధాప్యం మరో బాల్యం లాంటిది. పండుటాకులకూ పసిబిడ్డలకూ పెద్దగా తేడా ఉండదు. వృద్ధులతో వ్యవహరించేటప్పుడు కాస్త సున్నితంగా ఉండటం చాలా అవసరం. సగటు ఆయుర్దాయం పెరగడంతో వృద్ధుల సంఖ్య అనూహ్యంగా పెరుగుతోంది. వృద్ధుల సంఖ్యతోపాటే మలి వయసులో మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడే వారి సంఖ్యా పెరుగుతోంది. మానసిక చికిత్సా విభాగానికి వచ్చే ప్రతి వంద మందిలో 25 మంది వృద్ధులుంటున్నారు. వీరిలో అత్యధికులు డిప్రెషన్, నిద్రలేమి ఆందోళన, డిమెన్షియా వంటి ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి.

మానసిక రుగ్మతలు ఉన్నవారికి మెరుగైన చికిత్స అందుబాటులో ఉంది. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే ఆసుపత్రికి తీసుకువస్తే వ్యాధిని పూర్తిగా నియంత్రించ వచ్చు. అలాంటి వ్యాధి సోకితే జబ్బు తీవ్రత కంటే ఎక్కువగా మనం తల్లడిల్లిపోతాం. మనతో బాటు మనవాళ్ళూ ఆందోళన చెందుతారు. నాడీ సంబంధిత ప్రసరణ వ్యవస్థ (న్యూరో ట్రాన్స్ మిట్టర్స్)...మానసిక రుగ్మతలు మెదడులోని న్యూరో ట్రాన్స్ మిట్టర్స్ అని పిలువ బడే ప్రత్యేక రసాయనాలలో కలిగే అసాధారణమైన సమతుల్యానికి సంబంధం కలిగి ఉంటాయి. మెదడులో ఉండే నాడీ కణాలు ఒకదానితో మరొకటి సంబంధాన్ని నెరపుతూ ఉండడానికి సహకరించు కుంటాయి. ఒకవేళ ఈ రసాయనాలలో సమతౌల్యం లోపించినా లేక అవి సరిగా పనిచేస్తూ ఉండకపోయినా, మెదడులో సంకేతాలు ఒకచోట నుండి మరొకచోటకు సరిగా పంపబడుతూ ఉండవు, మానసిక అనారోగ్య లక్షణాలకు దారి తీస్తాయి. జన్యు శాస్త్రం... కుటుంబాలలో వస్తూ వుండే మానసిక రుగ్మతలు తమ కుటుంబంలో మరో ఏ సభ్యుడికైనా అటువంటివి ఉన్నట్లయితే, మిగతా వారు కూడా అటువంటి మానసిక రుగ్మతల బారిన పడే అవకాశాలను ఎక్కువగా కలిగి ఉంటారని సూచిస్తున్నాయి. మానసిక రుగ్మత, వైకల్యం అనేది అనేక జన్యువుల పరస్పరక్రియ, ప్రభావం (ఇంటరాక్షన్) వల్ల మరియు ఇతర అంశాల వల్ల -- అంటే ఒత్తిడి, దుర్వినియోగం, లేకపోతే ఒక శరాఘాతం (ట్రోమా) కలిగించే సంఘటన వంటివాటి వల్ల సంభవిస్తుంది. ఒక వ్యక్తి వారసత్వంగా ఈ రుగ్మతకు గురయ్యే అవకాశాన్ని కలిగి వున్నప్పుడు ఆ వ్యక్తిలో ఇవి అనారోగ్యాన్ని మరింత ప్రభావితం చేయడమో లేక అనారోగ్యాన్ని ఉసిగొల్పడమో చేస్తాయి. అంటు రోగాలు...మెదడు దెబ్బ తినడానికి మరియు మానసిక రుగ్మత వృద్ధి చెందడానికి లేక క్షీణించిపోతూ ఉండే పరిస్థితిని తెలియజేసే రోగ లక్షణాలతో సంబంధం కలిగి వుంటాయి. ఉదాహరణకు పీడియాట్రిక్ ఆటో ఇమ్యూన్ న్యూరో సైకియాట్రిక్ డిజార్డర్ (పి.ఏ.ఎన్.డి.ఏ) గా పిలువబడే పరిస్థితి పిల్లలలో స్ట్రెప్టోకోకస్ బ్యాక్టీరియా అనేది అబ్సెస్సివ్-కంపల్సివ్ డిజార్డర్ (నిరంతరం ఒకే భావంతో ఉండే స్థితి-తప్పనిసరి, బలవంత మైన వైకల్యం) మరియు ఇతర మానసిక రుగ్మతలు పెరగడంతో సంబంధం కలిగి ఉంటుంది. మెదడులో లోపాలు లేక గాయం...మెదడులో లేక మెదడు లోని కొన్ని భాగాలలో లోపాలు కలుగడం లేక గాయాలు కలిగి వుండడం అన్నది కొన్ని మానసిక రుగ్మతలతో సంబంధం కలిగి ఉంటుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# పితృరుణం తీర్చడం పుత్రుల కర్తవ్యం

## మహాలయ 'పెత్తర (పితృ)' అమావాస్య

జన్మనిచ్చిన తల్లిదండ్రులను, వంశాన్ని నిలబెట్టిన పూర్వీకులను స్మరించుకుంటూ వారి పట్ల భక్తిప్రపత్తులు చాటుకోవడం ప్రతి ఒక్కరి ప్రాథమిక ధర్మం. భాద్రపద మాసంలో వచ్చే కృష్ణ పక్షాన్ని 'మహాలయ పక్షం' లేదా పితృ పక్షంగా పరిగణిస్తారు. ఈ పదిహేను రోజుల కాలంలో పితృదేవతలను ఉద్దేశించి తర్పణాలు వదలడం, శ్రాద్ధకర్మలు నిర్వర్తించడం వల్ల పితృరుణం తీరుతుందని, పూర్వీకుల ఆత్మకు సద్గతులు లభిస్తాయని శాస్త్రాలు ప్రబోధిస్తున్నాయి. మహాలయ పక్షంలో పితృదేవతలు మనోమయ రూపంలో భూమిపైకి వచ్చి తమ వారసుల గృహాల వద్ద నిలుస్తారని స్కాంద పురాణం పేర్కొంటోంది. ఈ సమయంలో శ్రద్ధతో సమర్పించే తర్పణాలు, నువ్వులు మరియు అన్నదానాల ద్వారా పితృదేవతలు సంతృప్తి చెంది, తమ సంతతికి ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు మరియు వంశాభివృద్ధి కలగాలని దీవిస్తారు. నిత్య జీవితంలో ఎదురయ్యే ఆర్థిక నష్టాలు, సంతాన లేమి, మానసిక అలజడులు మరియు పనుల్లో నిరంతర ఆటంకాలకు జాతకంలో ఉండే పితృదోషాలే ప్రధాన కారణమని, శ్రాద్ధకర్మల నిర్వహణతో ఆ దోషాలు తొలగిపోతాయని పండితులు స్పష్టం చేస్తున్నారు. సాధారణంగా పూర్వీకులు మరణించిన తిథి ఆధారంగా శ్రాద్ధం పెట్టడం ఆనవాయితీ అయినప్పటికీ, తిథులు తెలియనివారు లేదా పక్షం రోజుల్లో సమయాభావం వల్ల చేయలేనివారు 'మహాలయ అమావాస్య' నాడు తర్పణం వదిలినా సమస్త పితృదేవతల ఆశీస్సులు లభిస్తాయి. ఆర్థిక లేదా ఇతర ఇబ్బందుల వల్ల శాస్త్రోక్తంగా కర్మలు నిర్వర్తించలేని వారు పశువులకు గ్రాసం అందించడం, లేదా అపరాహ్న సమయంలో ఆకాశం వైపు చేతులెత్తి పితృదేవతలను స్మరిస్తూ నమస్కరించినా పుణ్యఫలం లభిస్తుంది. ఈ పవిత్ర రోజుల్లో తర్పణాలు పూర్తి చేసిన అనంతరమే దేవతా పూజలు, శుభకార్యాలకు శ్రీకారం చుట్టాలని ఆధ్యాత్మిక వేత్తలు సూచిస్తున్నారు.





# ఆర్కిటిక్ ఓపెన్‌లో సింధు జోరు!

## క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లిన తెలుగు తేజం

## జపాన్ షట్లర్ రికో గుంజిపై వరుస గేముల్లో విజయం

## తొలి రౌండ్‌లోనే శ్రీకాంత్, తన్వి శర్మకు నిరాశ

**వంతా (ఫిన్లాండ్), అక్టోబర్ 9 (చురకలు):** ఆర్కిటిక్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత స్టార్ షట్లర్, తెలుగు తేజం పీవీ సింధు సత్తా చాటింది. మహిళల సింగిల్స్‌లో అద్భుత ప్రదర్శనతో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. జపాన్‌కు చెందిన రికో గుంజిపై 21–15, 21–15 తేడాతో వరుస గేముల్లో విజయం సాధించింది. మ్యాచ్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన సింధు ప్రత్యర్థికి పుంజుకునే అవకాశం ఇవ్వలేదు. రెండు గేముల్లోనూ ఆధిపత్యం ప్రదర్శించి తదుపరి రౌండ్‌కు అర్హత సాధించింది. మరోవైపు భారత షట్లర్లు కిదాంబి శ్రీకాంత్, యువ క్రీడాకారిణి తన్వి శర్మ తొలి రౌండ్‌లోనే ఓటమిపాలై టోర్నీ నుంచి నిష్క్రమించారు.

### శ్రీకాంత్‌కు చుక్కెదురు

పురుషుల సింగిల్స్‌లో తెలుగు షట్లర్ కిదాంబి శ్రీకాంత్‌కు నిరాశ ఎదురైంది. కెనడాకు చెందిన బ్రియాన్ యాంగ్‌తో జరిగిన పోరులో 21–15, 15–21, 13–21 తేడాతో ఓటమిపాలయ్యాడు. తొలి గేమ్‌ను గెలుచుకుని శుభారంభం చేసిన శ్రీకాంత్ ఆ తర్వాత అదే జోరును కొనసాగించలేకపోయాడు. రెండో గేమ్‌లో పుంజుకున్న బ్రియాన్ యాంగ్ నిర్ణయాత్మక మూడో గేమ్‌లోనూ ఆధిపత్యం ప్రదర్శించి విజయాన్ని అందుకున్నాడు.

### తన్వి శర్మ పోరాటానికి తెర

మహిళల సింగిల్స్‌లో యువ సంచలనం తన్వి శర్మ కూడా తొలి రౌండ్‌లోనే ఇంటిబాట పట్టింది. థాయ్‌లాండ్‌కు చెందిన రచనోక్ ఇంతనోన్ చేతిలో 18–21, 7–21 తేడాతో ఓటమి చవిచూసింది. తొలి గేమ్‌లో పోటీనిచ్చిన తన్వి రెండో గేమ్‌లో ప్రత్యర్థి దూకుడును అడ్డుకోలేకపోయింది. దీంతో భారత శిబిరానికి నిరాశ ఎదురైంది. ఈ నేపథ్యంలో క్వార్టర్ ఫైనల్‌కు చేరిన సింధుపైనే భారత అభిమానులు ఆశలు పెట్టుకున్నారు.



# రష్యా దెబ్బకు భారత్ విలవిల!

## మహిళల ఫుట్‌బాల్‌లో భారత జట్టుకు ఘోర పరాజయం

**కోల్‌కతా, అక్టోబర్ 9 (చురకలు):** రష్యాతో రెండు స్నేహపూర్వక మ్యాచ్‌ల సిరీస్‌ను భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు ఓటమితో ప్రారంభించింది. గురువారం జరిగిన తొలి పోరులో ప్రపంచ 27వ ర్యాంకర్ రష్యా చేతిలో భారత్ 4--0 గోల్స్ తేడాతో పరాజయం పాలైంది. మ్యాచ్ తొలి అర్ధభాగంలో ప్రత్యర్థికి గట్టి పోటీనిచ్చిన భారత క్రీడాకారిణులు రెండో అర్ధభాగంలో మాత్రం ఆ జోరును కొనసాగించలేకపోయారు. భారత రక్షణ శ్రేణిలో తలెత్తిన లోపాలను సద్వినియోగం చేసుకున్న రష్యా వరుస గోల్స్‌తో ఆధిపత్యం ప్రదర్శించింది. పటిష్ఠమైన రష్యా జట్టును ఎదుర్కొన్న భారత మహిళలు ఆరంభంలో సమర్థంగా పోరాడారు. ప్రత్యర్థి దాడులను అడ్డుకుంటూ మ్యాచ్‌పై పట్టు సాధించేందుకు ప్రయత్నించారు. అయితే రెండో అర్ధభాగంలో రష్యా దూకుడు పెంచడంతో భారత జట్టు ఒత్తిడికి గురైంది. వరుస దాడులతో భారత రక్షణ శ్రేణిని ఛేదించిన రష్యా గోల్స్ సాధించి విజయాన్ని ఖాయం చేసుకుంది. రష్యా విజయానికి పెతుఖోవా కీలకంగా నిలిచింది. రెండు గోల్స్ సాధించి భారత జట్టును దెబ్బతీసింది. రష్యా ఆటగాళ్ల మధ్య సమన్వయం, వేగవంతమైన దాడులు భారత జట్టుకు సవాల్‌గా మారాయి. చివరి వరకు పుంజుకునేందుకు భారత క్రీడాకారిణులు ప్రయత్నించినప్పటికీ గోల్ సాధించలేకపోయారు. దీంతో రష్యా నాలుగు గోల్స్ ఆధిక్యంతో మ్యాచ్‌ను ముగించింది. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా భారత్, రష్యా జట్లు అక్టోబర్ 11న మరోసారి తలపడనున్నాయి. తొలి మ్యాచ్‌లో ఎదురైన పరాజయం నుంచి పాఠాలు నేర్చుకుని రెండో పోరులో మెరుగైన ప్రదర్శన చేయాలని భారత జట్టు భావిస్తోంది. ముఖ్యంగా రక్షణ విభాగాన్ని పటిష్ఠం చేసుకోవడంతోపాటు గోల్స్ సాధించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవడం భారత్‌కు కీలకం కానుంది. రెండో మ్యాచ్‌లోనైనా రష్యాకు గట్టి పోటీనిచ్చి సత్తా చాటాలని భారత మహిళల జట్టు లక్ష్యంగా పెట్టుకుంది.

# ఏమి ఆట భయ్యా.. కొట్టుడే కొట్టుడు!

## విండీస్ బౌలర్లకు చుక్కలు చూపించిన భారత బ్యాటర్లు

- రెండో టీ20లో టీమిండియా పరుగుల సునామీ
- 20 ఓవర్లలో 5 వికెట్లకు 249 భారీ స్కోరు
- సిక్సర్ల వర్షం కురిపించిన సంజూ శాంసన్.. 41 బంతుల్లో 82 పరుగులు
- ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్, తిలక్ వర్మ మెరుపు ఇన్నింగ్స్‌లు
- టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న విండీస్‌కు చుక్కెదురు




**రాంచీ, అక్టోబర్ 10 (చురకలు):** ఒకరు కొడితే మరొ కరు అంతకుమించి బాదేశారు. ఫోర్లతో మొదలుపెట్టి సిక్సర్లతో విరుచుకుపడ్డారు. బంతి ఎక్కడ వేసినా బౌండరీ దాటించడమే లక్ష్యంగా భారత బ్యాటర్లు చెలరేగిపోయారు. వెస్టిండీస్ బౌలర్లకు ఊపిరి సలపనివ్వకుండా పరుగుల వర్షం కురిపించారు. రాంచీలోని జేఎస్‌సీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదికగా జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో టీమిండియా బ్యాటర్లు విధ్వంసం సృష్టించారు. టాస్ గెలిచి తొలుత బౌలింగ్ ఎంచుకున్న వెస్టిండీస్ నిర్ణయాన్ని తలకిందులు చేస్తూ భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 249 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్ సంజూ శాంసన్ సిక్సర్లతో స్టేడియాన్ని హోరెత్తించగా, ఇషాన్ కిషన్, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, తిలక్ వర్మ మెరుపు బ్యాటింగ్‌తో ప్రత్యర్థి బౌలర్లను బెంబేలెత్తించారు. బ్యాటర్ల దూకుడుతో రాంచీ స్టేడియం పరుగుల పండుగకు వేదికైంది.

### సంజూ సిక్సర్ల సునామీ!

భారత ఇన్నింగ్స్‌లో సంజూ శాంసన్ బ్యాటింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన సంజూ వెస్టిండీస్ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. కేవలం 41 బంతుల్లో నాలుగు ఫోర్లు, తొమ్మిది సిక్సర్లతో 82 పరుగులు సాధించాడు. మైదానం నలుమూలలా భారీ షాట్లు ఆడుతూ ప్రేక్షకులను ఉర్రూతలూగించాడు. మరో ఓపెనర్ అభిషేక్ శర్మ 20 పరుగులకే వెనుదిరిగినప్పటికీ సంజూ తన జోరును కొనసాగించాడు. బౌలర్లు మారుతున్నా అతడి బ్యాటింగ్ తీరు మాత్రం మారలేదు. బంతిని బౌండరీ దాటించడమే లక్ష్యంగా ఆడిన సంజూ భారత భారీ స్కోరుకు బలమైన పునాది వేశాడు.

### ఇషాన్ కిషన్ మెరుపులు

సంజూ శాంసన్‌కు ఇషాన్ కిషన్ నుంచి అద్భుతమైన సహకారం లభించింది. క్రీజులోకి వచ్చినప్పటి నుంచే దూకుడుగా ఆడిన ఇషాన్ కేవలం 22 బంతుల్లో రెండు ఫోర్లు, ఆరు సిక్సర్లతో 43 పరుగులు సాధించాడు. వెస్టిండీస్ బౌలర్లపై విరుచుకుపడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. సంజూ, ఇషాన్ బ్యాటింగ్ ధాటికి ప్రత్యర్థి జట్టు బౌలింగ్ వ్యూహాలు ఫలించలేదు. వీరిద్దరూ బౌండరీలతో విరుచుకుపడటంతో భారత జట్టు భారీ స్కోరు దిశగా దూసుకెళ్లింది.

### కెప్టెన్ శ్రేయస్ ఊచకోత!

భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ కూడా తనదైన శైలిలో చెలరేగిపోయాడు. కేవలం 18 బంతుల్లో ఒక ఫోర్, మూడు సిక్సర్లతో 40 పరుగులు సాధించాడు. తక్కువ బంతుల్లోనే భారీ పరుగులు రాబడుతూ జట్టు స్కోరును మరింత పెంచాడు. వెస్టిండీస్ బౌలర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. కీలక సమయంలో కెప్టెన్ ఆడిన మెరుపు ఇన్నింగ్స్ భారత జట్టు భారీ స్కోరు సాధించడంలో ముఖ్యపాత్ర పోషించింది.

### చివర్లో తిలక్ విధ్వంసం!

ఇన్నింగ్స్ చివరి ఓవర్లలో తిలక్ వర్మ బ్యాట్ ఝుళిపించాడు. కేవలం 18 బంతుల్లోనే 44 పరుగులు చేసి భారత స్కోరును మరింత పెంచాడు. చివరి ఓవర్లలో వెస్టిండీస్ బౌలర్లపై ఎదురుదాడికి దిగిన తిలక్ వరుసగా పరుగులు రాబట్టాడు. చివరి బంతికి నమన్ ధీర్ ఫోర్ బాదడంతో భారత ఇన్నింగ్స్ ఘనంగా ముగిసింది. అదనంగా తొమ్మిది పరుగులు రావడంతో టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 249 పరుగులు సాధించింది.

### వికెట్లు తీసినా ఆగని పరుగుల ప్రవాహం

వెస్టిండీస్ బౌలర్లలో రోస్టన్ చేజ్ మూడు వికెట్లు పడగొట్టగా, షామర్ స్ప్రింగర్ రెండు వికెట్లు సాధించాడు. అయినప్పటికీ భారత బ్యాటర్ల పరుగుల ప్రవాహాన్ని అడ్డుకోలేకపోయారు. ఒక బ్యాటర్ ఔటైనా మరో బ్యాటర్ అదే దూకుడును కొనసాగించడంతో వెస్టిండీస్ బౌలర్లకు ఊరట లభించలేదు. భారీ స్కోరుతో ప్రత్యర్థికి టీమిండియా సవాల్ విసిరింది. విజయానికి వెస్టిండీస్ 250 పరుగులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# టోర్నీకి ముందే పాక్ ఔట్!

- ఆసియా ఛాంపియన్స్ హాకీ ట్రోఫీ నుంచి పాకిస్థాన్ వైదొలగినట్లు కథనం
- తటస్థ వేదికపై మ్యాచ్ నిర్వహించాలన్న పాక్ హాకీ సమాఖ్య
- హైబ్రిడ్ విధానానికి అంగీకరించని నిర్వాహకులు
- అక్టోబర్ 27న జరగాల్సిన భారత్--పాక్ పోరుకు అడ్డంకి
- పాకిస్థాన్ స్థానంలో బంగ్లాదేశ్‌కు అవకాశం లభించినట్లు సమాచారం
- పంజాబ్‌లోని జలంధర్, మొహాలీ వేదికలుగా పోటీలు



**న్యూఢిల్లీ, అక్టోబర్ 9 (చురకలు):** ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ పురుషుల హాకీ టోర్నమెంట్ ప్రారంభానికి ముందే పాకిస్థాన్ జట్టు పోటీ నుంచి తప్పుకుంది. భారత్‌లో జరిగే టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు తటస్థ వేదిక ఏర్పాటు చేయాలన్న తమ ప్రతిపాదనను నిర్వాహకులు తిరస్కరించడంతో పాకిస్థాన్ హాకీ సమాఖ్య ఈ నిర్ణయం తీసుకుంది. అక్టోబర్ 27 నుంచి నవంబర్ 5 వరకు పంజాబ్‌లోని జలంధర్, మొహాలీ నగరాల్లో జరగనున్న ఈ ప్రతిష్ఠాత్మక పోటీల్లో పాకిస్థాన్ స్థానంలో బంగ్లాదేశ్‌కు అవకాశం కల్పించారు. ఈ మేరకు ఆసియా హాకీ సమాఖ్య శుక్రవారం సవరించిన మ్యాచ్‌ల షెడ్యూల్‌ను ప్రకటించింది. దీంతో హాకీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారత్–పాకిస్థాన్ పోరుకు తెరపడింది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న భారత జట్టు ఇప్పుడు బంగ్లాదేశ్‌తో తన తొలి మ్యాచ్ ఆడనుంది.

### తటస్థ వేదికపై పాక్ పట్టు

భారత్, పాకిస్థాన్ మధ్య కొనసాగుతున్న రాజకీయ, దౌత్యపరమైన ఉద్రిక్తతల నేపథ్యంలో తమ జట్టును భారత్‌కు పంపడం సాధ్యం కాదని పాకిస్థాన్ హాకీ సమాఖ్య పేర్కొంది. ఆటగాళ్లు, అధికారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని టోర్నమెంట్‌ను మరో దేశానికి తరలించాలని లేదా కనీసం పాకిస్థాన్ ఆడే మ్యాచ్‌లను తటస్థ వేదికపై నిర్వహించాలని ఆసియా హాకీ సమాఖ్యను కోరింది. సెప్టెంబర్ 16న ఈ మేరకు అధికారికంగా ప్రతిపాదన పంపింది. అయితే ముందుగా నిర్ణయించిన వేదికల్లోనే పోటీలు జరుగుతాయని హాకీ ఇండియా, ఆసియా హాకీ సమాఖ్య స్పష్టం చేశాయి. పాకిస్థాన్ ప్రతిపాదనను అంగీకరించకపోవడంతో టోర్నమెంట్ నుంచి వైదొలుగుతున్నట్లు ఆ దేశ హాకీ సమాఖ్య ప్రకటించింది.



### పాక్ స్థానంలో బంగ్లాదేశ్‌కు అవకాశం

పాకిస్థాన్ తప్పుకోవడంతో ఖాళీ అయిన స్థానాన్ని బంగ్లాదేశ్‌తో భర్తీ చేశారు. తొలుత బంగ్లాదేశ్, ఒమన్ జట్లను ప్రత్యామ్నాయ జట్లుగా గుర్తించిన ఆసియా హాకీ సమాఖ్య, పాక్ నిర్ణయం అనంతరం బంగ్లాదేశ్‌కు ఆహ్వానం పంపింది. ఆ దేశ హాకీ సమాఖ్య అంగీకరించడంతో సవరించిన షెడ్యూల్‌ను విడుదల చేసింది. తాజా షెడ్యూల్ ప్రకారం భారత్, బంగ్లాదేశ్, చైనా, జపాన్, మలేషియా, దక్షిణకొరియా జట్లు టోర్నమెంట్‌లో పాల్గొననున్నాయి. ఆరు జట్లు లీగ్ దశలో ఒక్కో ప్రత్యర్థితో తలపడతాయి. అత్యధిక పాయింట్లు సాధించిన నాలుగు జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి.

### అక్టోబర్ 27న బంగ్లాదేశ్‌తో భారత్ తొలి పోరు

సవరించిన షెడ్యూల్ ప్రకారం భారత జట్టు అక్టోబర్ 27న బంగ్లాదేశ్‌తో తన తొలి మ్యాచ్ ఆడనుంది. అనంతరం అక్టోబర్ 29న చైనా, 30న జపాన్, నవంబర్ 1న మలేషియా, నవంబర్ 2న దక్షిణకొరియాతో తలపడుతుంది. భారత జట్టు లీగ్ మ్యాచ్‌లన్నీ సాయంత్రం ఏడు గంటలకు ప్రారంభమవుతాయి. తొలుత నవంబర్ 1న జరగాల్సిన భారత్–పాకిస్థాన్ మ్యాచ్ స్థానంలో భారత్–మలేషియా పోరును నిర్వహించనున్నారు. దీంతో దాయాదుల మధ్య మరో ఆసక్తికర హాకీ సమరాన్ని చూడాలనుకున్న అభిమానులకు నిరాశ ఎదురైంది.

### రెండు నగరాల్లో హాకీ సందడి

పంజాబ్‌లోని జలంధర్, మొహాలీ నగరాలు ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీకి ఆతిథ్యం ఇవ్వనున్నాయి. జలంధర్‌లోని ఒలింపియన్ సుర్జిత్ సింగ్ హాకీ స్టేడియంలో అక్టోబర్ 27 నుంచి నవంబర్ 2 వరకు లీగ్ మ్యాచ్‌లు జరుగుతాయి. ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని కూడా అక్కడే నిర్వహించనున్నారు. అనంతరం పోటీలు మొహాలీలోని ఒలింపియన్ బల్బీర్ సింగ్ సీనియర్ అంతర్జాతీయ హాకీ స్టేడియానికి మారనున్నాయి. నవంబర్ 4న సెమీఫైనల్స్, నవంబర్ 5న కాంస్య పతక పోరు, ఫైనల్ నిర్వహించనున్నారు. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత పంజాబ్‌లో పెద్ద అంతర్జాతీయ హాకీ టోర్నమెంట్ జరగనుండటంతో ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది.

### మరో టైటిల్‌పై భారత్ గురి

ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీలో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న భారత జట్టు మరోసారి టైటిల్‌ను దక్కించుకోవడమే లక్ష్యంగా సిద్ధమవుతోంది. ఇటీవల జపాన్‌లో జరిగిన ఆసియా క్రీడల్లో మలేషియాను ఓడించి స్వర్ణ పతకం సాధించిన హర్మన్‌ప్రీత్ సింగ్ సేన మంచి ఆత్మవిశ్వాసంతో ఉంది. ఆసియా క్రీడల సెమీఫైనల్లో పాకిస్థాన్‌ను 4–3 గోల్స్ తేడాతో ఓడించిన భారత్, ఫైనల్లో మలేషియాపై 5–1తో విజయం సాధించింది. అదే జోరును స్వదేశంలో జరిగే ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీలోనూ కొనసాగించాలని భావిస్తోంది. పాకిస్థాన్ వైదొలగడంతో టోర్నమెంట్ సమీకరణాలు మారినప్పటికీ మిగిలిన ఐదు జట్ల నుంచి భారత్‌కు గట్టి పోటీ ఎదురయ్యే అవకాశం ఉంది.



# ఆత్మవిశ్వాసమే ముఖ్యం!

## సామాజిక మాధ్యమాల ట్రోలింగ్‌పై కత్రినా కైఫ్ ఘాటు స్పందన

ముంబై, అక్టోబర్ 9 (చురకలు): ఆన్‌లైన్ వేదికల్లో వచ్చే ప్రతికూల విమర్శలు, ట్రోలింగ్‌కు భయపడితే జీవితంలో ముందుకు సాగలేమని ప్రముఖ బాలీవుడ్ నటి కత్రినా కైఫ్ స్పష్టం చేశారు. సామాజిక మాధ్యమాల్లో ఎదురయ్యే వ్యతిరేక వ్యాఖ్యలు మన ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయకుండా చూసుకోవాలని హితవు పలికారు. లండన్‌లో తన సొంత సౌందర్య ఉత్పత్తుల బ్రాండ్ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. గతేడాది నవంబరులో మగబిడ్డకు జన్మనిచ్చిన కత్రినా కైఫ్, ప్రసవానంతరం ముంబైలో జరిగిన ఒక బహిరంగ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సమయంలో ఆమె శరీరాకృతిపై (బాడీ షేమింగ్) కొందరు నెటిజన్లు సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ పరిణామంపై స్పందించిన కత్రినా.. ప్రసవం తర్వాత మహిళల శరీరంలో మార్పులు సహజమని, ప్రతి ఒక్కరి అభిప్రాయాలను పట్టించుకుంటూ పోతే మన జీవితానికి సంబంధించిన నిర్ణయాలు సరిగ్గా తీసుకోలేమని వ్యాఖ్యానించారు. ఇతరుల విమర్శలకు ప్రతిసారీ స్పందిస్తూ ఉంటే భయంతో ముందడుగు వేయలేని పరిస్థితి ఏర్పడుతుందని, కొన్నిసార్లు ప్రపంచం మనల్ని ప్రశంసిస్తే, మరికొన్నిసార్లు మనకు మనమే ధైర్యం చెప్పుకోవాల్సి వస్తుందని ఆమె పేర్కొన్నారు. వ్యక్తిగత జీవితంలో మార్పులు వచ్చినా ఇతరుల వ్యాఖ్యలకు వెరవకుండా ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలంటూ కత్రినా ఇచ్చిన సందేశం ప్రస్తుతం చలనచిత్ర వర్గాల్లోనూ, సామాజిక మాధ్యమాల్లోనూ విస్తృతంగా చర్చనీయాంశమైంది.



# పెళ్లిపై మంచి అబ్బాయి దొరికితే త్వరలోనే వివాహం!

## సుప్రీత ఆసక్తికర వ్యాఖ్యలు

హైదరాబాద్, అక్టోబర్ 9 (చురకలు): టాలీవుడ్ నటి సురేఖ వాణి కుమార్తె, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ సుప్రీత నాయుడు తన వివాహం, వ్యక్తిగత జీవితంపై చేసిన ఆసక్తికర వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. యాంకర్ వర్ష నిర్వహిస్తున్న ఒక ప్రత్యేక వినోద కార్యక్రమంలో పాల్గొన్న ఆమె, తన రిలేషన్‌షిప్ స్టేటస్ మరియు వివాహ వ్యవస్థపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. ప్రస్తుతం తాను ఒంటరిగానే (సింగిల్) ఉన్నానని తెలిపిన సుప్రీత, ఒక్కోసారి ఒంటరిగా ఉండటం విసుగు తెప్పిస్తోందని పేర్కొన్నారు. తనకు సరైన వ్యక్తి లభించడం లేదని, మంచి అబ్బాయి దొరికితే త్వరగా పెళ్లి చేయాలని తన తల్లిని కోరినట్లు సరదాగా వ్యాఖ్యానించారు. ప్రస్తుత సమాజంలో విడాకులు, దంపతుల మధ్య తలెత్తుతున్న వివాదాలను చూసి తన పెళ్లి విషయంలో తల్లి సురేఖ వాణి కాస్త ఆందోళన వ్యక్తం చేస్తున్నప్పటికీ, తనకు మాత్రం అలాంటి భయాలేమీ లేవని స్పష్టం చేశారు. ఎలాంటి పరిస్థితులనైనా ధైర్యంగా ఎదుర్కొంటానని, పెళ్లి తర్వాత భర్తను తన నియంత్రణలోనే ఉంచుకుంటానంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు నవ్వులు పూయించాయి. కవర్ సాంగ్స్, లఘు చిత్రాల ద్వారా గుర్తింపు పొందిన సుప్రీత, ప్రస్తుతం వెండితెర మరియు బుల్లితెరపై తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. తల్లి సురేఖ వాణితో కలిసి ఆమె చేసే రీల్స్, ఫోటోషూట్‌లకు నెటిజన్ల నుంచి విశేష ఆదరణ లభిస్తున్న తరుణంలో, పెళ్లిపై సుప్రీత చేసిన ఈ వ్యాఖ్యలు అభిమానుల్లో కొత్త ఆసక్తిని రేకెత్తించాయి.

# స్టార్‌డమ్‌కు దూరంగా ఆయేషా టకియా

## కుటుంబ జీవితానికే అగ్రతాంబూలం!



ముంబై, అక్టోబర్ 9 (చురకలు): అక్కినేని నాగార్జున సరసన 'సూపర్' చిత్రంతో తెలుగు ప్రేక్షకులను అలరించడంతో పాటు, సల్మాన్ ఖాన్‌తో కలిసి 'వాంటెడ్' మూవీతో బాలీవుడ్‌లో సంచలనం సృష్టించిన అందాల నటి ఆయేషా టకియా సినీ ప్రస్థానం మరోసారి ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. కెరీర్ అత్యున్నత శిఖరాల్లో ఉన్న సమయంలోనే వెండితెరకు స్వస్తి చెప్పిన ఆమె, వర్తమానంలో స్టార్‌డమ్‌కు దూరంగా ప్రశాంతమైన కుటుంబ జీవితాన్ని గడుపుతున్నారు. చిన్న వయసులోనే మోడలింగ్‌లోకి అడుగుపెట్టిన ఆయేషా టకియా, షాహిద్ కపూర్‌తో కలిసి చేసిన 'కంలోన్' ప్రకటన మరియు ఫల్గుణి పాఠక్ పాడిన 'మేరీ చునర్ ఉడ్ ఉడ్ జాయే' మ్యూజిక్ వీడియోతో యువతలో విపరీతమైన క్రేజ్ సంపాదించుకున్నారు. 2004లో 'టార్జాన్: ది వండర్ కార్' చిత్రంతో బాలీవుడ్‌లోకి అరంగేట్రం చేసి, తొలి చిత్రానికే 'ఉత్తమ నూతన నటి'గా ఫిలిమ్‌ఫేర్ పురస్కారాన్ని అందుకుని అందరి దృష్టిని ఆకర్షించారు. ఆ తర్వాత 'సోచా నా థా', 'డోర్' వంటి చిత్రాల్లో వైవిధ్యమైన నటనతో విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు. వరుస అవకాశాలతో అత్యంత బిజీగా ఉన్న తరుణంలోనే, 2009 మార్చి 1న తన 22వ ఏట వ్యాపారవేత్త ఫర్హాన్ అజ్మీని వివాహం చేసుకుని అందరినీ ఆశ్చర్యపరిచారు. పెళ్లి అనంతరం నటనకు వీడ్కోలు చెప్పిన ఆమె కుటుంబ బాధ్యతలకు ప్రాధాన్యమిచ్చారు. 2013లో వీరికి కుమారుడు మైకేల్ జన్మించాడు. ఒకానొక దశలో ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్నారంటూ వచ్చిన ఆరోపణలు, సామాజిక మాధ్యమాల్లో జరిగిన ట్రోలింగ్‌పై స్పందిస్తూ ఆ ఫోటోలు మార్ఫింగ్ చేసినవని స్పష్టత ఇచ్చారు. ప్రస్తుతం విలాసవంతమైన సినీ జీవితానికి, సోషల్ మీడియా హడావుడికి దూరంగా ఉంటూ జంతు సంరక్షణ కార్యక్రమాలు మరియు కుటుంబ సంక్షేమానికే తన సమయాన్ని కేటాయిస్తున్నారు.



# 'భోగి'లో పల్లె పరిమళం.. తొలి పాట విడుదల

**హైదరాబాద్, అక్టోబరు 9 (చురకలు):** చార్మింగ్ స్టార్ శర్వానంద్ కథానాయకుడిగా, సంపత్ నంది దర్శకత్వంలో తెరకెక్కుతున్న పీరియడ్ యాక్షన్ చిత్రం 'భోగి' నుంచి తొలి పాట 'ఎగిలివారంగ' విడుదలైంది. చిత్ర ప్రచారంలో భాగంగా విడుదల చేసిన ఈ జానపద గీతం సంగీత ప్రియులను ఆకట్టుకుంటోంది. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు మంచి స్పందన రావడంతో సినిమాపై అంచనాలు పెరిగాయి. 'ఎగిలివారంగ' పాటకు భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించగా, ప్రముఖ గేయ రచయిత చంద్రబోస్ సాహిత్యం సమకూర్చారు. నల్గొండ గద్దర్ నరసన్న, కందుకూరి శంకర్ బాబు, రేలారే గోపాల్ తమ గాత్రంతో పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. విడుదలైన పోస్టర్‌లో పండుగ వాతావరణం ప్రతిబింబిస్తోంది. ఈ పాటను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్న దర్శకుడు సంపత్ నంది.. ఇది కేవలం పాట మాత్రమే కాదని, ప్రతి పల్లె ఆత్మను పలకరించే మధురమైన జ్ఞాపకమని పేర్కొన్నారు. చంద్రబోస్ భావాలు, భీమ్స్ రాగాలు కలసి ఈ గీతానికి ప్రత్యేకతను తీసుకొచ్చాయని తెలిపారు. 1960ల నాటి గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ పీరియడ్ యాక్షన్ డ్రామా టీజర్ ఇప్పటికే యూట్యూబ్‌లో కోటిన్నర వీక్షణలను దాటినట్లు చిత్రబృందం వెల్లడించింది. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కె.కె. రాధామోహన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శర్వానంద్‌కు జోడీగా అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి నటిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి 'భోగి'ని నవంబరు 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.




This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com